నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

నమ్మలేని నిజాలు

నేతల మాట
విద్య వైద్యం ఉచితం
చేతల్లో శూన్యం.

పంట మార్పిడి
కొఱమీను కంకులు
పైసల పైరు.

పెళ్లి పిలుపు
నైరుతికి స్వాగతం
చిన్నుల చిందు.

ఎర్ర బొబ్బలు
శుచిశుభ్రతలోపం
టమాటో వైరస్.

ఇథియోపియా
ఆలోచనల సంద్రం
నెలలు 13దూ.

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాయి

రాజకీయాలు కుళ్ళే
కులాల కుమ్ములాటలకు,
దేశం అభాసుపాలే
మతాల మంటలాటలకు,

జాతి వర్ణ వివక్షతో
రాజుకుంది కుంపటి !
భిన్నత్వం కవితలతో
తయారైంది సంపుటి !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

హైదరాబాద్ | గురువారం 9-6-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :28 | సంచిక: 248 | పేజీలు:6 | వెల: రూ.1/-

మృగశిర కార్తె రోజున మంత్రి తలసానికి కొర్రమీను చేపలు

హైదరాబాద్, జూన్ 8: తెలంగాణ రాష్ట్రంలో మత్స్య సంపద భారీగా పెరిగిందని, మత్స్యకారులు ఎంతో సంతోషంగా ఉన్నారని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. బుధవారం మృగశిర కార్తె సందర్భంగా గజ్వేల్ నియోజకవర్గ పరిధిలోని తూప్రాన్‌కు చెందిన మత్స్యకారులు మంత్రి తలసానికి కొర్రమీను చేపలను అందజేశారు.

ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు అన్ని నీటి వనరులలో ఉచితంగా చేపపిల్లలను విడుదల చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకున్న చర్యలతో రాష్ట్రంలో మత్స్యకారుల ఆదాయ భారీగా పెరిగిందని, ఎంతో ఆనందంగా ఉన్నారని చెప్పారు.

ప్రతి సంవత్సరం మృగశిర కార్తె రోజున మంత్రికి కొర్రమీను చేపలను అందిస్తున్నట్లు మత్స్యకారులు తెలిపారు. మత్స్యకారుల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో శాదా కోటేశ్వరరావు, గడప దేవేందర్, గరిగే నరసింగరావు, గరిగే సంపత్ తదితరులు ఉన్నారు

బలూచిస్థాన్‌లో ఘోర ప్రమాదం.. 22 మంది మృతి

న్యూఢిల్లీ, జూన్ 8:పాకిస్థాన్‌లో ఘోర ప్రమాదం సంభవించింది. బలూచిస్థాన్ ప్రాంతంలో ఓ వ్యాన్ లోయలోకి పడిన ఘటనలో 22 మంది ప్రాణాలు కోల్పోయారు. వీరిలో ఐదుగురు మహిళలు, ఐదుగురు చిన్నారులు ఉన్నారు. ప్రమాదం నుంచి ఒక్క బాలిక మాత్రమే గాయాలతో బయటపడింది. ప్రమాదం జరిగిన సమయంలో వ్యాన్‌లో 23 మంది ఉన్నారని, ఇందులో 22 మంది మరణించినట్లు పేర్కొంది. ఓ చిన్నారి తీవ్రంగా గాయపడి, ప్రాణాలతో బయటపడ్డట్లు తెలుస్తోంది. ఈరోజు ఉదయం 23 మందితో వ్యాన్ జోబ్‌కు వెళ్తున్న సమయంలో.. అక్తర్ జాయ్ సమీపంలో కొండపై నుంచి వ్యాన్‌లో లోయలో పడిపోయిందని జిల్లా డిప్యూటీ కమిషనర్ హఫీజ్ ముహమ్మద్ ఖాసిం తెలిపారు.

విమాన ప్రయాణికులకు మాస్క్ తప్పనిసరి.. డీజీసీఏ ఆదేశాలు

న్యూఢిల్లీ, జూన్ 8: కరోనా కేసులు మళ్లీ అధికమవుతున్న నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. విమాన ప్రయాణికులకు మాస్క్ తప్పనిసరి చేస్తూ డీజీసీఏ ఆదేశాలు జారీ చేసింది. మాస్క్ లేని ప్రయాణికులను బోర్డింగ్‌కు ముందే ఆపాలని ఆదేశించింది. ప్రయాణ సమయమంతా మాస్క్ ధరించి ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. మాస్క్ లేకుంటే ఎయిర్‌పోర్టులోకి అనుమతించొద్దని సూచించింది. ఈ మేరకు పౌర విమానయాన శాఖ సీఐఎస్ఎఫ్‌కు తాజాగా మార్గదర్శకాలు పంపింది.

కొవిడ్ భద్రతా చర్యలను పాటించేందుకు నిరాకరించే విమాన ప్రయాణికులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఇటీవలే ఢిల్లీ హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. కరోనా మహమ్మారి ప్రభావం ముగియలేదని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలకు కోర్టు ఆదేశించింది. కొవిడ్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ఆరోగ్య మంత్రిత్వ శాఖ లేదా డీజీసీఏ మార్గదర్శకాల ప్రకారం చర్య తీసుకోవాలని ఆదేశించిన విషయం విదితమే.

దేశంలో రోజువారీ కరోనా కేసులు భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. మంగళవారం 3714 కేసులు నమోదవగా, బుధవారం నాటికి ఆ సంఖ్య 5,233కు పెరిగింది. ఇది నిన్నటికంటే 41 శాతం అధికం. దీంతో మొత్తం కేసులు 4,31,90,282కు చేరాయి. ఇందులో 4,26,36,710 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,24,715 మంది మృతిచెందగా, 28,857 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, గత 24 గంటల్లో ఏడుగురు మరణించగా, 1881 మంది డిశ్చార్జీ అయ్యారు.

కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో 1881 కేసులు ఉన్నాయి. ఇందులో 1242 కేసులు ముంబైకి చెందినవేనని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక కేరళలో 1494, ఢిల్లీలో 450, కర్ణాటకలో 348, హర్యానాలో 227 కేసులు ఉన్నాయి.

చరిత్రలో నేటినిజం

తం॥ జూన్, రాళ్లన, పిగాన
ప్రాణాతికేమైన నటనప్రకటించే తెలం
గాణా శకుంతలమ్మగని
రాళ్లం చెను తెలుగు చిత్రరంగమ్మునెనకే !!

–రాధశ్రీ
(జూన్ 9 తెలంగాణా శకుంతల జయంతి...)
సెల్: 9494481210

బీజేపీ అధికారంలోకి వస్తే ఆర్టీసీ అమ్మకానికే.. : మంత్రి హరీశ్‌రావు

హైదరాబాద్, జూన్ 8:బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే ఆర్టీసీని సైతం అమ్మకానికి పెడుతోందని మంత్రి హరీశ్‌రావు అన్నారు. మెదక్ జిల్లా సర్నాపూర్ బస్ డిపోను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో ఎండాకాలంలోనూ కరెంటు కష్టాలు లేవని, 70 ఏళ్లలో గత ప్రభుత్వాలు ఒక్క చెక్ డ్యామ్ నిర్మించలేదని ఆరోపించారు. ఎనిమిదేళ్లలో 15 చెక్‌డ్యామ్‌లు కట్టామన్నారు. డబుల్ ఇంజిన్ సర్కారున్న కర్నాటకలో పరిస్థితి ఏంటని ఈ సందర్భంగా మంత్రి ప్రశ్నించారు.

కర్ణాటకలో రూ.1400కు క్వింటాల్ వడ్లు కొంటే.. తెలంగాణలో రూ.1920కి కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కర్నాటక రైతులు రాష్ట్రానికి ధాన్యం తెచ్చి అమ్ముకుంటున్నారన్నారు. తెలంగాణలోని సంక్షేమ పథకాలు కర్నాటకలో లేవన్నారు. వడ్లు కొనుగోలు చేయకుండా కేంద్రం మోసం చేసిందని ఆరోపించారు. రైతులు ఇబ్బంది పడొద్దని ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసిందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలను మోసం చేయడమే తెలుసునని ఆరోపించారు. బీజేపీకి గుజరాత్ తప్ప మరో ఆలోచన లేదన్నారు. కేంద్రం తీరు తెలంగాణకు మాటలు.. గుజరాత్‌కు మూటలు ఉన్నట్లుందని ఎద్దేవా చేశారు.

పార్లమెంట్‌లో ఇచ్చిన వరంగల్ కోచ్ ఫ్యాక్టరీ హామీ ఏమైందని, తెలంగాణకు రావాల్సిన రైల్వే కోచ్ ఫ్యాక్టరీ గుజరాత్ వెళ్లిందన్నారు. ఆర్థిక సంఘం నివేదికను కేంద్రం తొక్కిపెట్టిందని, తెలంగాణకు రూ.9వేలకోట్ల ఎగనామం పెట్టిందని, నీతి ఆయోగ్ సూచనలు ఎందుకు పాటించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ గుండె చప్పుడు కేసీఆర్ అన్నారు. సర్నాపూర్‌లో త్వరలో టూరిస్ట్ హబ్, పీజీ కాలేజీకి పక్కా భవనం నిర్మిస్తామన్నారు. రూ.35కోట్లు మంజూరు చేశామని, మల్లన్నసాగర్ నీళ్లు సర్నాపూర్ వస్తాయని, కాలంతో పని లేకుండా నీళ్లు వచ్చేలా చేస్తామన్నారు.

టీఆర్ఎస్ పాలనలోనే ప్రగతి పరుగులు : మంత్రి ఎర్రబెల్లి

రంగారెడ్డి : టీఆర్ఎస్ పాలనలోనే గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతున్నాయని పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. 5వ విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా.. బుధవారం జిల్లాలోని మహేశ్వరం మండలం గొల్లూరులో పల్లె ప్రగతి కార్యక్రమంలో మంత్రి సబితా ఇంద్రా రెడ్డితో కలిసి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.

గ్రామంలో తెలంగాణ క్రీడా ప్రాంగణాన్ని ప్రారంభించిన మంత్రులు.. హరితహారంలో భాగంగా మొక్కలు నాటారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. అనంతరం అంశాల వారీగా గ్రామాభివృద్ధిపై సమీక్షించారు.

గ్రామానికి మిషన్ భగీరథ నీరు వస్తుందా? ట్రాక్టర్ గ్రామంలో ఎన్ని గంటల నుంచి తిరుగుతున్నది? డంపింగ్ యార్డు పని చేస్తున్నదా? తడి పొడి చెత్త వేరు చేసి ఎరువులు తయారు చేస్తున్నారా? ఎంత మేర ఆదాయం సమకూరుతుంది? వైకుంఠ ధామం వనిలోకి వచ్చిందా? వినియోగిస్తున్నారా? సంక్షేమ పథకాలు వస్తున్నాయా? వంటి ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గ్రామం నుంచి బడి పిల్లల కోసం బస్ ను వేయిస్తామమని చెప్పారు. గొల్లూరులో మహిళలకు స్త్రీ నిధి కింద రూ.3 లక్షల వరకు నిధులు అందజేస్తామని హామీనిచ్చారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. గ్రామానికి సంక్షేమ పథకాలు అన్నీ కలిపి కోటి రూపాయలను ప్రభుత్వం ఇస్తున్నది.

గతంలో ఇలా ఎప్పుడైనా వచ్చిందా? గత ప్రభుత్వాలు ఏమి చేశాయి? ఈ ప్రభుత్వం ఏమి చేసింది? అనే విషయాన్ని ప్రజలు ఆలోచన చేయాలన్నారు. సీఎం కేసీఆర్ పాలనలో అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. 70 ఏళ్ల నుంచి కానిది ఎనిమిదేండ్లలో సాధించి చూపారని ఆయన ప్రశంసించారు.కాంగ్రెస్, బీజేపీ దేశాన్ని సర్వ నాశనం చేశారు. కేసీఆర్ ఇప్పుడు రాష్ట్రాన్ని బాగు చేస్తున్నారని స్పష్టం చేశారు. ఎంపీ కార్యక్రమంలో డాక్టర్ జి రంజిత రెడ్డి, జెడ్పీ చైర్ పర్సన్ అనితారెడ్డి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

హన్వాడలో పలు అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్ నగర్, జూన్ 8: తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గ్రామాల అభివృద్ధిలో అనూహ్యమైన మార్పు వచ్చిందని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. ఐదో విడత పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆయన హన్వాడ మండలంలోని పలు గ్రామాలలో వివిధ అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు.

అయోధ్య నగర్ శివారులో షేక్ పల్లి నుంచి అయోధ్య నగర్ మీదుగా వేపూర్ వరకు రెండు కోట్ల యాభై ఐదు లక్షల 80 వేల రూపాయల వ్యయంతో నిర్మించనున్న రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో ఏర్పాటుచేసిన ఉచిత నట్టల నివారణ కార్యక్రమం లో పాల్గొని గొర్రెలకు,మేకలకు ఉచితంగా నట్టల నివారణ మందులు వేశారు. 16 లక్షల 70 వేల రూపాయల వ్యయంతో నిర్మించిన తాగునీటి ట్యాంక్‌ను ప్రారంభించారు.

అనంతరం గ్రామ సభలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత గ్రామాలు ఎంతగానో అభివృద్ధి చెందాయని అన్నారు. పెన్షన్లుజ రైతు బంధు ,రైతు బీమా, కల్యాణలక్ష్మి , ఆసరా వంటి కార్యక్రమాల కింద ప్రతి ఒక్కరిని ఆదుకుంటుందని తెలిపారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇంటి స్థలాలు ఉంటే ఇల్లు కట్టించి ఇస్తామని, ఇల్లు లేని వారందరికీ దశలవారీగా ఇండ్లు ఇస్తామని తెలిపారు. గ్రామ యువత ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉంటూ గ్రామాభివృద్ధికి పాటుపడాలని పిలుపునిచ్చారు.

మేడ్చల్‌లో 125 కిలోల గంజాయి స్వాధీనం.. నలుగురు అరెస్ట్

మేడ్చల్, జూన్ 8: ఉప్పల్ పరిధిలోని మల్లాపూర్ చౌరస్తాలో భారీగా గంజాయి పట్టుబడింది. గంజాయిని మహారాష్ట్రకు తరలించేందుకు యత్నించిన నలుగురు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ ముఠా సభ్యులకు చెందిన కారులో నుంచి 125 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు పోలీసులు నిర్ధారించారు. విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు నిర్వహించి, గంజాయి రవాణాను అడ్డుకున్నారు.

అయితే ఓ వ్యక్తి అరకు నుంచి గంజాయిని హైదరాబాద్‌కు తీసుకొచ్చాడు. మల్లాపూర్ చౌరస్తాలో మరో ముగ్గురు వ్యక్తులు గంజాయి కోసం వేచి చూస్తున్నారు. ఇదే సమయంలో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అనుమానాస్పదంగా తిరుగుతున్న ఆ ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారించారు.

కారులో ఓ వ్యక్తి గంజాయి తీసుకొస్తున్నాడని వారు పోలీసులకు తెలిపారు. దీంతో పోలీసులు అక్కడే ఉండి, గంజాయిని తరలిస్తున్న కారును గుర్తించి సీజ్ చేశారు.

ఈ గంజాయిని పుణె తరలించేందుకు ముగ్గురు వ్యక్తులు సిద్ధమైనట్లు పోలీసులు తెలిపారు.

కారులో ఉన్న 125 కిలోల గంజాయితో పాటు నాలుగు మొబైల్ ఫోన్లు, రూ. 92 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు.

అయితే ఒడిశాకు చెందిన శంకర్ బెహారా అరకులో 125 కిలోల గంజాయిని(కిలో గంజాయి రూ. 2000) కొనుగోలు చేశాడు. దీన్ని మిగతా ముగ్గురికి రూ. 5 వేల చొప్పున కిలో గంజాయిని విక్రయించేందుకు బేరం కుదుర్చుకున్నాడు. పుణెలో రూ. 12 వేల చొప్పున కిలో గంజాయిని అమ్మేందుకు ప్లాన్ చేసినట్లు పోలీసులు తేల్చారు.

దళితుల అభివృద్ధి కోసమే దళితబంధు: మంత్రి తలసాని

హైదరాబాద్, జూన్ 8: దళితుల సమగ్రాభివృద్ధి కోసమే ప్రభుత్వం దళిత బంధు పథకాన్ని ప్రవేశపెట్టిందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఆర్థికంగా ఎంతో వెనుకబడిన దళితులు అభివృద్ధి సాధించాలనేది సీఎం కేసీఆర్ ఆలోచన అని చెప్పారు. హైదరాబాద్ వెస్ట్ మారేడ్‌పల్లిలో దళితబంధు లబ్ధిదారులకు వాహనాలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడు తూ.. ఒక్కో లబ్ధిదారుడికి రూ.10 లక్షల ఆర్థిక సహాయం అందించే ఇలాంటి కార్యక్రమం దేశంలో ఎక్కడా అమలులో లేదని చెప్పారు.

ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలి సూచించారు. గతంలో ఎవరైనా దళితుల అభివృద్ధి గురించి ఆలోచించారా అని ప్రశ్నించారు. ప్రధాని మోదీ.. హైదరాబాద్ కార్పొరేటర్లను ఢిల్లీకి పిలిచి ఒట్టి చేతులతో పంపారని, నగర అభివృద్ధి కోసం నిధులిస్తే ప్రజలకు మేలు జరిగేదని విమర్శించారు.

కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో మంత్రి కేటీఆర్ భేటీ

న్యూఢిల్లీ, జూన్ 8: కేంద్ర నైపుణ్యాభివృద్ధి, ఎలక్ట్రానిక్స్, టెక్నాలజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్‌తో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ సమావేశమయ్యారు. భారత ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పరిశ్రమలో ఉన్న అభివృద్ధి అవకాశాలపై కేంద్ర మంత్రితో కేటీఆర్ చర్చించారు. పారిశ్రామికవేత్తలకు అనుకూలమైన ఎకోసిస్టమ్‌ను సృష్టించేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. మంత్రి కేటీఆర్ వెంట ఎంపీలు నామా నాగేశ్వర్ రావు, సురేశ్ రెడ్డి, పరిశ్రమల శాఖ కార్యదర్శి జయేశ్ రంజన్, తెలంగాణ భవన్ రెసిడెంట్ కమిషనర్ గౌరవ్ ఉప్పల్ ఉన్నారు.

జులై 5న బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణం.. వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు..

హైదరాబాద్, జూన్ 8: బల్కంపేట ఎల్లమ్మ కళ్యాణాన్ని జులై 5వ తేదీన వైభవంగా నిర్వహించనున్నట్లు పశు సంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. వివిధ శాఖల అధికారు లతో ఎల్లమ్మ అమ్మవారి కళ్యాణం నిర్వహణ, ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జులై 4వ తేదీన ఎదుర్కోళ్ళు, 5వ తేదీన కళ్యాణం, 6వ తేదీన రథోత్సవం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. అమ్మవారి కళ్యాణాన్ని భక్తులు లైవ్‌లో చూసేవిధంగా టీవీలలో ప్రసారం చేస్తా మన్నారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ ఆదేశాలతో అమ్మవారి కళ్యాణం, బోనాలు పండుగలను ప్రభుత్వం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహి స్తున్నట్లు తెలిపారు. ఇతర రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరావడం అంశాలను దృష్టిలో ఉంచుకుని వచ్చే భక్తుల సంఖ్యకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తామన్నారు.

తోపులాటకు అవకాశం లేకుండా అలాగే భక్తులు అసౌకర్యానికి గురి కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటామన్నారు. ప్రత్యేకంగా ఆర్టీసీ బస్సు లను నడుపుతామన్నారు. శాంతిభద్రతల్లో భాగంగా పోలీసు బందోబస్తుతో పాటు సీసీ కెమోరాలను ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి తలసాని సూచించారు. రహదారుల మరమ్మతులు ఉంటే ఇప్పటి నుండే పనులు ప్రారం భించాలని అధికారులకు ఆయన సూచించారు. అమ్మవారి రథోత్సవం యాత్రకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా విద్యుత్ తీగలను సరిచేసి, చెట్ల కొమ్మల తొల గింపు చర్యలు చేపట్టాలన్నారు. దర్శనం పాస్‌ల జారీలో డూప్లికేషన్‌కు ఆస్కారం లేకుండా బార్ కోడింగ్‌లతో కూడిన పాస్‌లను జారీ చేయాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ సమీక్షలో దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణ : మండలి చైర్మన్ గుత్తా

నల్లగొండ, జూన్ 8: గ్రామాల అభివృద్ధి కోసం తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక పథకాలతో కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందన్నారు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి అన్నారు. జిల్లాలోని చిట్యాల మండలం చిన్నకాపర్తి గ్రామంలో పల్లె ప్రగతి కార్యక్రమంలో భాగంగా మన ఊరు– మన బడి పథకం కింద 38 లక్షల రూపాయలతో గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల అభివృద్ధి పనులకు, గ్రామంలో రూ. 20 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డు పనులకు సుఖేందర్ రెడ్డి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామస్తులు విజ్ఞప్తి మేరకు అభివృద్ధి పనుల కోసం తన నిధుల నుంచి 15 లక్షలు మంజూరు చేశానన్నారు. ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తూ తెలంగాణ ప్రభుత్వం పల్లె ప్రగతి పేరుతో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టిందన్నారు.దీంతో గ్రామాల రూపురేఖలు మారబోతున్నాయని ఆయన పేర్కొన్నారు. అనంతరం అంగన్వాడీ ఆధ్వర్యంలో నిర్వహించిన బడిబాట కార్యక్రమంలో మండలి చైర్మన్, ఎమ్మెల్యే పాల్గొన్నారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

దేశంలో భారీగా పెరిగిన కరోనా కేసులు.. కొత్తగా 5233 మందికి పాజిటివ్

న్యూఢిల్లీ, జూన్ 8:దేశంలో రోజువారీ కరోనా కేసులు భారీగా పెరిగాయి. మంగళవారం 3714 కేసులు నమోదవగా, తాజాగా ఆ సంఖ్య 5233కు పెరిగింది. ఇది నిన్నటికంటే 41 శాతం అధికం. దీంతో మొత్తం కేసులు 4,31,90,282కు చేరాయి. ఇందులో 4,26,36,710 మంది బాధితులు కోలుకున్నారు. ఇప్పటివరకు 5,24,715 మంది మృతిచెందగా, 28,857 కేసులు యాక్టివ్‌గా ఉన్నాయి. కాగా, గత 24 గంటల్లో ఏడుగురు మరణించగా, 1881 మంది డిశ్చార్జీ అయ్యారు.

కొత్తగా నమోదైన కేసుల్లో అత్యధికంగా మహారాష్ట్రలో 1881 కేసులు ఉన్నాయి. ఇందులో 1242 కేసులు ముంబైకి చెందినవేనని కేంద్ర ఆరోగ్యశాఖ వెల్లడించింది. ఇక కేరళలో 1494, ఢిల్లీలో 450, కర్ణాటకలో 348, హర్యానాలో 227 కేసులు ఉన్నాయి.కాగా, రోజువారీ పాజిటివ్ కేసులు పెరుగుతుండటంతో యాక్టివ్ కేసులు 0.07 శాతానికి చేరాయి. రికవరీ రేటు 98.72 శాతం, మరణాల రేటు 1.21 శాతంగా ఉన్నదని తెలిపింది. ఇప్పటివరకు 1,94,43,26,416 వ్యాక్సిన్ డోసులను పంపిణీ చేశామని, ఇందులో మంగళవారం 14,94,086 మంది వ్యాక్సిన్ తీసుకున్నారని వెల్లడించింది. దీంతోపాటు జూన్ 7న 3,13,361 మందికి కరోనా పరీక్షలు నిర్వహించామని, ఇప్పటివరకు మొత్తం 85,35,22,623 నమూనాలను పరీక్షించామని ఐసీఎమ్మార్ ప్రకటించింది.

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com

శీలా వీర్రాజు స్మృతిలో..

వీర్రాజు గారూ!
మీరిక లేరంటే
రాత్రంతా నిద్ర పట్టలేదు
మీరు లేకుండానే తెల్లారటం
ఒక నల్లని వాస్తవం.

సాహిత్యంలో
ఎన్నో మైలురాళ్లను నాటారు మీరు
మీ మంచితనంతో
అసంఖ్యాక హృదయాలను మీటారు.
మిమ్మల్ని కలిస్తే
మనిషిని కలిసి నట్టుండేది
తెలంగాణా పల్లెల్లోని
కవి కిశోరాలు దశబ్దాల పాటు
మీ ముఖ చిత్రాల కోసం
హైదరాబాద్‌కు క్యూ కట్టేవారు.
ఎవరికీ లొంగని
ఇనుప జంతువు హైదరాబాద్
అది మీ ప్రేమ ముందు మాత్రం
వినమ్ర సుందరంగా వొదిగి పొయ్యేది.

మీరు ఇండ్లు మారినప్పుడల్లా
మా నడక దారులు మారేవి
అవి బస్టాండ్‌లకు సుదూరంగా ఉండటం మీ స్టైల్.
మీ ఇంట్లోకి అడుగు పెట్టగానే
మానియేచర్ ఆర్ట్ గ్యాలరీలో
కిప్రవేశించి నట్టుండేది.
గుమ్మాలకు కట్టిన కళాత్మక తోరణాలు
మీ చిరునవ్వుల్లా వేలాడుతుండేవి.
కవీ చిత్రకారుడనేది ఒక పార్శ్వం
సాదా సీదా వ్యక్తిత్వం మీది,
గోదావరిని దేశమంతా అద్దిన
ఆర్ద్రమూర్తి మీరు.
యాభై యేండ్ల మన స్నేహితం
నేటి నుంచి ఒక అఖాతం.
ఇవాళ ఒక మహానుభావు
నిమహాభినిష్క్రమణం జరిగింది
అంతటా ఖాళీలు ఏర్పడుతూ
కాలం ఒంటరిదయ్యింది.

-డా॥ ఎన్. గోపి
సెల్:9391028496

రక్త మార్పిడి !

లోకంలో ఒక పక్క . . .
మేధావులు , కుహనా మేధావులు
స్వయం ప్రకటిత మేధావులు , కవులు
కళాకారులు , విద్వాంసులంతా
సమాజాన్ని సమయం వచ్చినప్పుడల్లా
సమస్యలపై తూర్పార బడుతున్నారు కాని ,
సంతానంపై శ్రద్ధను తుంగలో తొక్కుతున్నారు
సమసమాజ నిర్మాణ బాట మరుస్తున్నారు !.

అవసరాలు తీర్చే అడ్వాన్స్ టెక్నాలజీతో
అతి స్మార్ట్ నెస్ మేధావివర్గ సమూహాలతో
అక్రమ సంపాధన పైనున్న భక్తి శ్రద్ధలతో
సమాజదృష్టిని స్వార్థపరత్వానికై మరల్చి
పరోక్ష విచ్ఛిన్నతకు పట్టం కడుతున్నారు
సమసమాజ నిర్మాణ బాట మరుస్తున్నారు !.

ఎంతో సాధనతో , ఎంతో దీక్షతో సాధించిన
IAS, IPS , IRS లు , ప్రొఫెసర్లు, న్యాయాధీశులు
ఇంజనీర్లు , వైద్యులు , రాజ్యాంగకోవిదులు
ఉన్నత పదవుల్లోని వారి వారసులెవరినైనా
వారంతటి స్థాయికి తీసుకెళ్ళుతున్నారా ?
వాగ్దేవిని ఆశీస్సులకై వరమడుగుతున్నారా ?
వారి అంతరాత్మ నడిగితే
పరాభవం కనిపించదా ?

ముచ్చటగా మూడుశాతానికి మించని వీరి
పిల్లల విజయ గాథలు విస్తు గొల్పుతుంటే
డ్రాపౌట్లుగా జోకర్లై , ప్రోకర్లుగా తయారై
తల్లిదండ్రుల అవినీతి ఆస్థిపాస్తులతో
క్రమశిక్షణ కరువై , సమాజానికి బరువై
ఆర్థిక స్వేచ్ఛలతో , అధికార విలాసాలతో
చేసే మోసాలను మొలత్రాళ్ళుగా కట్టుకుంటే
పెద్దలే గద్దలై , అధికారశక్తితో అవలీలగా
నేర వారసులను వెనుకేసుకొస్తున్నారు
రాజ్యాంగ వృక్షాన్ని రంపాలతో కోస్తున్నారు !

మరోపక్క ....
చదువు సంధ్యలేమీ లేకున్నా
సంతకాలు సైతం పెట్టరాకున్నా
రాజకీయంలో రంకు బొంకు నేర్చుకున్న
ప్రతీ పార్టీనాయకులు , వారి వారసులు
అనుచరులంతా నేడు పేదలపై పెత్తందార్లే !

దర్జాగా పల్లెల్లో, దౌర్జన్యంగా పట్టణాలల్లో
అమాయక ప్రజలకు ప్రతినాయకులై
ప్రతీకార పగ్గాలుబట్టిన ముఠాలతో
లెక్కలేనంత అరాచక సంపాదనతో
న్యాయానికి నామరూపాల్లేకుండా చేస్తూ
ఖరీదైన వాహనాల్లో జల్సాలు చేస్తున్నారు !

రాజకీయ నాయకులకు , నటులకు
ఏ చదువు, ఏ సర్టిఫికెట్లు లేకున్నా
ఆస్థులు, అంతస్థులు , అరాచకమే
అర్హతలుగా , అనుకున్నదే తడవుగా
వారసత్వంగా అన్నీ సమకూరుతున్నాయి !

ఆర్థిక సష్టాలకు , ఆర్థిక అవసరాలకు తప్ప
దేశంతో , రాజ్యాంగంతో , న్యాయస్థానాలతో
మంచిచెడులతో అవసరమెప్పుడు రాదు
డబ్బే పరమావధి , విలాసమే విస్తృత పరిధి
మానవత్వమన్న మాట మచ్చుకైనా లేదు !
సంపాదనకన్నీ మాల్సే ! ఏ రూల్స్ లేవు !
చూస్తేఅంతా తోపే ! కాళ్ళుమొక్కితే అన్నీ మాఫే !

కళ్ళముందు అక్రమాలను అద్దంలో చూస్తూ
చవటల చెప్పుచేతుల్లో అణిగి మణిగిన
అధికార గణమంతా అంగలార్చుతున్నారు
చిల్లరగా తయారైన సిగ్గుచేటు వ్యవస్థలో
ఆత్మసాక్షిగా అభిమానం అడ్డొచ్చినవాళ్ళంతా
ఆవేదనతో అవస్థల పాలైతున్నారు !

అయినా కాని , . . .
దేశ విదేశాల్లో ఏ ప్రతిభలో చూసినా
ఏ రాష్ట్ర ప్రవేశ పరీక్షలో చూసినా
ఏ అంతర్జాతీయ, జాతీయక్రీడలో చూసినా
అంతరిక్ష , సైనిక, శాస్త్ర సాంకేతికతలో
వైద్య విద్యా రంగాల్లో ఎక్కడ చూసినా ,
నా గుండెల్లో నిండిన నిరుపేద గ్రామీణ
తమ్ముళ్ళదే , చెల్లెల్లదే విజయకేతనం !

ఏ సదుపాయాల్లేక , ఎన్నో ప్రయాసలకోర్చి
బడుగు వర్గాలుగా బ్రతుకు ఈడ్చుకొచ్చినా
అరకొర సౌకర్యాలతో అందలమెక్కినా
అదేమిటో ఎప్పటికీ అర్థంకాదు !
అవినీతిపరుల మనసులో , అన్యాయపు
అధికారుల దృష్టిలో ఇప్పటికీ కనికరం కరువే !

అందుకే ...
సాయంచేసే సౌభాగ్యమున్న ఓ అధికారులారా
ప్రజాసేవ పేరుతో లూటీ చేస్తున్న రాబందులారా
మానవత్వ పరిమళాల సువాసనలు చూడండి
మమ్ములను ఒక్కసారైనా మీ పిల్లలనుకొండి
బాధ్యతలు మరిచి మమ్ము బజారు కీడ్చకండి
రాజ్యాంగ బద్ధంగా రాజసంతో ముందుకురండి
ఇది మా బ్రతిమిలాటనే కాని బెదిరింపు కాదు !
ఇప్పటికైనా మమ్మల్ని మనుషులనుకొని
మన గడ్డపైననే పుట్టినవాళ్ళనుకొని
మీ గుండెల్లో , మీ మెదళ్ళలో,
మీ ఆలోచనల్లో
మీ నాలుకల్లో ,
నరనరాన రక్తమార్పిడి చేసుకోండి!

- డా. డి. రాజేశ్, 9440460490

తెలంగాణ దేశమా..

తెలంగాణ దేశానికి® దిక్కూచులు మీరు
తెలంగాణ అనువనువున మీ జ్ఞాపకాలు
తెలంగాణ చరిత్రలో తడిసిన రక్తాక్షరాలు
మీ అసమాన్యపు బలిదానం అనునిత్యం తలిచేము
॥ తెలంగాణ ॥
మీమ్ము కన్నతల్లి కడుపు చల్లగా
మా పచ్చని పంటలు పండగా
మీ త్యాగం తలుచుకుంటు దీపం వెలిగించేము
మరపురాని మీ తెగువకు నమస్సని తలవంచేము
॥ తెలంగాణ ॥
వీరులారా అమరులారా సాహసాల బిడ్డలార
తల్లి రుణం తీర్చుకున్న మబ్బుల్లో మెరుపులారా
కదిలించే పాటల్లో కన్నతల్లి కన్నీటిలో
కలుకుమనీ తళుకుమనీ కనిపించీ పోతుంటిర
॥తెలంగాణ ॥
పూవులందు దాగిన మకరందమె మీరు
తేనెలూరు తీరొక్క పూలతీరు మీరు
ప్రాణదీపమయ్యి కొత్త వెలుగులు పంచేరు
తెలంగాణ కోటి ప్రభల ఉత్సవ కాంతి మీరు
॥తెలంగాణ ॥
గన్‌పార్క్ స్మృతి చిహ్నం గోలకొండ గుండెల నాదం
జనజాతర ఉద్యమ గీతం ఉప్పొంగిన సాగర తీరం
అన్నింటా మీరే అన్నీ మీరే అందుకొండి మా జోతలు
అమరులార జోహారులు ! వీరులార జోహారులు !
॥తెలంగాణ ॥
లేత బంగారు కిరణాల తొలిపొద్దులు మీరు
పచ్చని తంగెళ్ళ నుండి వీచే గాలులు మీరు
తొవ్వ పువ్వులై మమ్ము పలకరిస్తు ఉంటారు
ఎర్రమల్లెలై గట్ల మీద పూస్తూ ఉంటారు
॥ తెలంగాణ ॥
వసంతరుతువు మేఘాలై గర్జిస్తూ ఉంటారు
వానల చినుకులయ్యి వచ్చిపోతూ తాకేరు
తెగిన తీగెల శిథిల వీణ నిన్నటి మన తెలంగాణ
మీరు మీటిన తెలంగాణ ఉద్యమాల రుద్రవీణ
॥ తెలంగాణ ॥
మీ కలల నేల సాగుచేయు రైతు కార్మికులము మేము
శాంతి పాట పాడేటి కవిగాయకులం మేము
మీ ఊపిరి పోసుకోని మునుముందుకు సాగేము
మీ ఆశయ సాధనకు పిడికిలి బిగించేము
॥ తెలంగాణ ॥
మన నవ రాష్ట్రపు విజయోత్సవాల వేళ
ఊరురా వెలుగు దివిటీల హేల
నాటి మీ ఆత్మార్పణల అజెండాలు !
నేడు సగౌరవంగా రాష్ట్రావతరణ జెండాలు !!
॥ తెలంగాణ ॥

(2 జూన్ 2022 తెలంగాణ
రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవ
కవి సమ్మేళనం హనుమకొండ జిల్లా)

♦'తెలంగాణ దేశం'
కాళోజీ సృష్టించిన పదం

-అనిశెట్టి రజిత
9849482462

మరాళము!!

గూడు వదలి పోవురోజు
గురుతు గలిగినపుడు
గువ్వలా శాంతి దూతవు కాగలవు
కాకివికావప్పుడు!

వచ్చునాడు తుచ్ఛమైన
జననాంగ మార్గణమే నీవని
తెలియనైతివేని..
వంచన పంచన పట్టక పంచు -
పలువురి మేలుగోరి
దయను ప్రతినబూని!

నాశహితమైన దేహమందు..
మోహము మోసకారణము
న్యకృతి చూపు బొంది..
ధర్మ కాములకు నాశనకారకము!

ధనము వలనగాని
అధికార దర్పములతోని
వచ్చు దండము
దంగయి వలె దండళూకమేగాని
కానేరదు అభిమానోద్ధము!

వింత గొలుపు జీవుల బతుకుల
గెంతులేపాటిచేయు
గత్తరమ్ములు వచ్చి
గడపగడపలో గబులురేప
ఘడియ సుడిలో!

వచ్చునాడు ఎటుల వచ్చితివో..
మరిచిన లేదు నష్టమేమియు
పోవునాడు దోతుడు కాడితడు -
దాతవీడనుచు జనులు మెచ్చవలయు!

నేడుండి రేపు వాడిపోవు
పువ్వుల వారసత్వం
శాశ్వతం వాటి పరిమళం
నూరేండ్ల నీ జీవితం కావాలి పదుగురిక
ఆదర్శనీయకథాంశం మరాళము వలె..!!

-శివ మంచాల
9004428159

ఘంటారవం

అన్ని భోగాలకు మూలం
ఎన్ని త్యాగాలో
ఇన్ని భాగ్యాలకు మూలం
ఎన్ని మేఘాలో.
పరుల ప్రశంసల కోసం
పరితపించకు
నీనిజరూపం
నీకే తెలుసని మరువకు.

పసిపాపలు పలకనిభాష
ముసలిదవుతుంది
పరిమళ ప్రసారమాగిన
ప్రసూనమవుతుంది.

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

ఆచార్య జయశంకర్‌కు అక్షర నీరాజనం..!

తెలంగాణ సిద్ధాంతకర్త- ఆచార్య జయశంకర్ సార్ స్మారక సూచకంగా తెలుగు భాషా చైతన్య సమితి లక్ష్య సాధన ఫౌండేషన్.. తెలంగాణ విద్యార్థి నిరుద్యోగ యువజన జె.ఏ.సి. సంయుక్త ఆధ్వర్యంలో ఓ గ్రంథాన్ని వెలువరించి.. జయశంకర్ గారి పట్ల కవులు.. కవయిత్రులు తమ గౌర వాన్ని చాటుకున్నారు. డా॥వి. జయప్రకాశ్- ఎన్.అరుణ ప్రధాన సంపాదకత్వంలో ఈ గ్రంథం లోని కవితలన్నీ ఆచార్య జయ శంకర్‌కు అక్షర హారతి పట్టాయి. తెలంగాణ జాతిపితగా భాసిల్లిన ఆయనకు కవితా నీరాజనం చేసి అందరు ఆయనపట్ల తమ శ్రద్ధాభక్తులను ప్రకటించారు.

జయశంకర్ జీవితం-వ్యక్తిత్వం- జయశంకర్ - తెలంగాణ ఆకాంక్ష.. జయ శంకర్ ఉద్యమ ప్రస్థానం..జయశంకర్ ఆశ యసాధన నేటితరం కర్తవ్యం అన్న అం శాలపై ఇందలి కవితలు కొలువు దీరాయి. ఈ గ్రంథ రూపకల్పనలో పి. బడేసాబ్, మన అశోక్ యాదవ్, ముప్పూరి పురు షోత్తం, బి. వెంకటేశ్వర్లు, పెబ్బేటి మల్లిఖా ర్జున్, కె.వి. జనార్దన్, డా॥ఎడ్ల కల్లేశ్ మరి యు సకిరేకంటి శీనయ్యలు సంపాద వర్గంలో ఉండి.. ప్రధాన సంపాదకులకు అండగా నిలిచారు.

ఈ సంకలనం ఆరంభంలో.. ప్రతిభా రత్న డా॥ మహ్మద్‌షరీఫ్, పాణ్యం దత్తశర్మ, అయ్యవారు మురళి, నాయని రాములు, పద్యాలతో ఆచార్య జయశంకర్ జీవితాన్ని- వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించారు. కందుకూరి భాస్కర్, ఆరెకటికె నాగేశ్వరరావు, శీలోజు శోభన్‌బాబు, మణిపూసలు రూపంలో తమ అంజలి ఘటించారు. తెలంగాణ ఉద్యమకర్త అని అభివర్ణిస్తూ మొగ్గలు రూపంలో జయశంకర్‌ను స్తుతిస్తూ పోలె వెంకటయ్య తమ భావాలను మనతో పంచుకున్నారు.

ఆచార్య జయశంకర్ ఒక చరితగన్న సిద్ధాంతకర్త అంటూ కుదుమ తిరుమలరావు రాస్తే.. నీ ఉద్యమ బాటలు పయనిస్తా మంటూ చింతపట్ల వెంకరమణాచారి యోగి పేర్కొన్నారు. 'సద్యోజాతకుడు'గా జయ శంకర్‌ను పిళ్ళావెంకటరమణమూర్తి అభివ ర్ణిస్తూ తెలంగాణ సూత్రధారి అంటూ జె.వి.కుమార్ చేవూరి కొనియాడారు. నిజాం పాలననే వృతిరేకించిన ధైర్యశాలి అంటూ యలమర్తి అనూరాధ కీర్తిస్తే.. జయశంకర్ జోహార్ అంటూ సురేందర్‌చట్ల అంజలి సమర్పిం చారు. పల్లె నుండి ప్రపంచ దేశాలకు సాగిన ఆయన ప్రస్థానం అనిర్వచనీయమంటూ డా॥ వాసరవేణి పర్శరాములు రాస్తే.. "యుగ పురుషుడు"గా డా॥కందుల శ్రీను కొనియాడారు. ఓరుగల్లుకే తలమాణికం అంటూ డా॥ నన్నపురాజు విజయ అక్షర నీరాజనం సమర్పిస్తే.. ఆయన సదాస్మరణీ యుడు.. తెలంగాణ జాతికి పితృ సమానుడు అంటూ డా॥ వైరాగ్యం ప్రభాకర్ రాశారు. 'అస్తిత్వ కేతనం'గా డా॥ చింతల రాకేశ్ భవాని వర్ణిస్తే.. ఉద్యమాల ఊపిరి జయశంకరుడు అంటూ నామని సుజనాదేవి కితాబునిచ్చారు.

'పడిలేచిన కెరటం' అంటూ యెల్టి సుదర్శన్ పద్మశాలి రాస్తే.. 'మరణం లేని మేరునగధీరుడు' అంటూ డా॥ చీదెళ్ల సీతాలక్ష్మి తమ కవితను తీర్చిదిద్దారు. "యాది మరువని సార్ మన జయశంకర్ సార్" అంటూ డా॥ శ్రీభాష్యం అనురాధ రాస్తే.. జయహో జయశంకర్ సార్ అంటూ కర్నాటి రాములు గౌడ్ పద్య ప్రక్రియలో తమ నివాళులు అర్పించారు. కాకతీయ స్వాభిమాన వారసత్వ కేతనం అంటూ మనోహర్‌రెడ్డి గంటా కొనియాడితే.. కళ్ళముందు వాస్తవాన్ని కనిపెట్టిన ఘనుడు అంటూ డా॥భీంపల్లి శ్రీకాంత్ రాశారు.

నీ కలలు కండ్ల ముందటికి రాకముందే నన్ను ఒంటిపిట్టని చేసి యాడికి పోయినావు పెద్దయ్యా! అంటూ జూపాక సుభద్ర



రాస్తే.. సున్నితం ప్రక్రియలో శ్రీమతి పుల్లాభట్ల జగదీశ్వరి మూర్తి, గీతారాణి అవధానుల తమ కవితల్ని తీర్చి దిద్దారు. తాడిచెర్ల రవి 'తెలంగాణ తొలికిరణం' అంటూ గేయం రాస్తే.. 'స్ఫూర్తి శిఖరం' అంటూ పద్య కవితను నవరత్నాలు.. నూతన ఛంద స్సులో వెంకటరాణాప్రతాప్ అందించారు.

ఆశలనన్నింటి ననచివేసి దొరల పాలన వచ్చె దుర్మార్గము హెచ్చె.. దుష్టపాలన యంత దూర్తులైరి అంటూ సీసపద్య మాలిక ద్వారా వేములశ్రీ వేమనశ్రీ చరణ్‌షాయి దాస్ తమ ఆవేదనను వ్యక్త పరిచారు. 'తెలంగాణ సిద్ధాంతకర్తగా' సీస పద్య మాలిక ద్వారా కొడిచెర్ల రామానుజ రాశారు. బి. అనంతయ్య మణిపూసలు రూపంలో 'తెలంగాణ వైతాళి కుడు'గా వర్ణిస్తే.. మణిపూసలు రూపంలోనే ప్రతిభాభారతి తెలాగణ జాతిపితగా పేర్కొన్నారు. 'తెలంగాణ ఆకాంక్ష' శీర్షికతో రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి రాస్తే.. 'తెలంగాణ ఉద్యమ వారధి' అంటూ తాటిపాముల రమేష్ తమ కవితను తీర్చిదిద్దారు. వలిపే సత్యనీలిమ ఆచార్య జయశంకర్‌ను తెలంగాణ 'ముద్దుబిడ్డ' అంటూ తమ కవితను రాస్తే.. 'పోరుపొద్దు' శీర్షికతో డా॥ ఎడ్ల కల్లేశ్‌రాశారు. 'తెలంగాణ అక్షర శిల్పి'గా ఇంద్రావత్ రాహుల్, 'ఆచార్యుడు'గా డా॥ రామక కృష్ణమూర్తి తమ కవితల్ని రాశారు. నీ ఆలోచనల బాట, కావాలి నేటి పాలకుల నోటిమాట అంటూ బంధకవి శ్రీని వాసరావు ఆకాంక్షిస్తే.. కోట్లాది తెలంగాణ ప్రజల గుండె చప్పుడు వినిపించిన రథసారథి అంటూ వల్లభట్ల వనజ తమ కవితకు రూపమిచ్చారు. తెలంగాణ కాలజ్ఞాని అంటూ యామిని కొల్లూరు రాస్తే.. మండవ సుధ తెలంగాణ రూపశిల్పిగా ఆచార్య జయశంకర్‌ను వర్ణించారు. ఆయన జనను మనపుణ్య ఫలం.. తెలంగాణ అణువణువూ నిండిన రుణమంటూ డా॥ సమ్మెట విజయ అక్షరశిల్పికి జోతలు సమర్పిస్తే.. కలగానే మిగిలిన ఆశయం అంటూ నీలం శేఖర్ వాపోయారు.

వృత్తిపట్ల నిబద్ధత.. ఉద్యమం పట్ల చిత్తశుద్ధి ఉన్న గొప్పమనిషి అంటూ చివుకుల శ్రీలక్ష్మి అభిప్రాయపడితే.. 'సంకల్ప జ్యోతి'గా సాలూరి సంతోషి వర్ణించారు.

తెలంగాణ జాతిపితగా ప్రజల నాలు కలపై నడయాడుతున్నావంటూ డా॥నిద్దాం తవు ప్రభాకరాచార్యులు పేర్కొంటే.. 'తెలంగాణ స్మృతి కిరణం'గా జి. శిరీష తమ కవితను రూపుదిద్దారు. ఇంటి పేరులోనే కాదు.. పోరుబాటలోనూ చూపించావు "కొత్త"దనం అంటూ ఆకెళ్ళ వెంకట సుబ్బలక్ష్మి రాస్తే.. జయహో జయ శంకరా అంటూ రావుల కిరణ్మయి జోహార్లు అర్పించారు.

సాక హరీష్‌బాబు 'ప్రశ్నించే గొంతు క'గా ఆచార్య అయ్యల సోమయాజుల ప్రసా ద్ 'తెలంగాణ రూపశిల్పి'గా మురళీయాదవ్ 'తెలంగాణ ధృవతార'గా అభివర్ణిస్తూ తమ కవితలను రాస్తే.. చరిత్రను మరిచిపోతున్న చరిత్రహీనులకు ఏమని ఆదేశిస్తారు? అంటూ వడ్డేపల్లి మల్లేశం ప్రశ్నించారు.

ఉద్యమానికి ఊపిరిలూదిన సిద్ధాంత కర్త అంటూ వడ్డేపల్లి నర్సింగరావు రాస్తే.. 'తెలంగాణ-రూప చిత్రలేఖకుడు' అంటూ దామెర్ల సరసింహారావు కొనియాడారు. 'నిప్పుకణం' అంటూ సౌదరి మోహన్‌గౌడ్ తమ కవితను రాస్తే.. 'తెలంగాణ స్వాప్నికుడు' అంటూ కె. హన్మాండ్లు తమ కవితను తీర్చిదిద్దారు. తెలంగాణ బాపూజీ.. నీ బాటలోనే నడిచే బలమివ్వూ అంటూ ఏడెల్లి రాములు రాస్తే.. 'నిత్య స్వాప్నికుడు' అంటూ లోడెరాములు తమ కవితను రూపదిద్దారు. 'తెలంగాణకు తొవ్వజూపిన నిన్నెట్ల మరువుమంటావు అని డా॥ గుడేలి శీను రాస్తే.. 'తెలంగాణ పితామహుడు' అంటూ కొంపెల్లి రామయ్య తమ కవితను కొనసాగించారు.

తెలంగాణ ప్రజల భాగ్యవిధాత అంటూ కల్పన దేవసాని రాస్తే.. ఉద్యమ స్ఫూర్తిగా అభివర్ణిస్తూ డా॥ దాసోజు పద్మావతి తెలంగాణ పితామహుడికి నివాళు లు అర్పించారు. ఆచార్య జయశంకర్ కలలు గన్న అద్భుత రాష్ట్రంగా తయారు కావాలంటే.. మనలో మనం విప్లవించాల్సిందే ంటూ డా॥ గౌరవరాజు సతీష్‌కు మార్ పిలుపునిస్తే... 'అమర స్వాప్నికుడు' అంటూ పరిమి వెంకట సత్యమూర్తి తమ కవితను రాశారు.

జనశ్రీ కుడికాల జనార్దన్ గేయ రూపంలో తమ భావాలను ప్రకటిస్తే.. తాటి హరీష్ నానీల రూపంలో తెలంగాణ తొలి ఉద్యమకర్తకు నివాళులు సమర్పించారు.

జయశంకరా! జయము! జయము! అంటూ కట్ట రంజిత్‌కుమార్ పద్య కవిత ద్వారా అక్షరాంజలి ఘటించారు. పద్య ప్రక్రియలోనే గుడేలి రమేశ్ నిత్యచైతన్యశీలి అంటూ తమ ఆలోచనలను అక్షరాల్లో నిక్షిప్తం చేశారు.

'ఉద్యమాల నేత' అంటూ కె. ఆనంద్, 'తెలంగాణ వేగుచుక్క' అంటూ పడిచర్ల సత్యం మనిపూసలు రూపంలో ఆచార్య జయశంకర్ పట్ల తమ గౌరవ ప్రపత్తులను చాటుకున్నారు. 'తెలంగాణ ఉద్యమకర్త' శీర్షికతో పోలె వెంకటయ్య మొగ్గలు రాస్తే 'ఉద్యమ స్ఫూర్తి ప్రదాత'గా బడిగించల అంపయ్య తమ కవితను రూపుదిద్దారు.

'తెలంగాణ బుద్దుడు'గా నెల్లుట్ల సునీత, 'తెలంగాణ ఈశ్వరుడు' అంటూ గజరాజ మధు, 'భావదీప్తి ప్రభాసుడు' అంటూడా॥ పాండాల మహేశ్వర్, 'మార్గ నిర్దేశకుడు' అంటూ అద్దంకి తిరుమల వాణిశ్రీ, 'తెలం గాణ తెరచాప', అంటూ చెరుకు మహేశ్వర శర్మ తమ తమ కవితల్ని తీర్చిదిద్దారు.

'జయహో! ఆచార్య' అంటూ వనం సావిత్రి రాస్తే.. జయశంకర్ ఉద్యమ ప్రస్థానాన్ని ప్రస్తావిస్తూ జాధవ్ ముకుంద్ రావు తమ కవితను రూపదిద్దారు.

డా॥ తుండు కృష్ణ కౌండిన్య జయ శంకర్‌ను తెలంగాణ అస్తిత్వ బావుటా'గా వర్ణిస్తే.. జయకేతనం' అంటూ కరిపె రాజ్‌కుమార్ తమ కవితను అల్లారు.

రికిబండ్ల విష్ణుప్రియ "చైతన్య కిరణం" శీర్షికతో తమ భావాలను అక్షరాల్లో బంధిస్తే.. 'తెలంగాణ చిత్ర గుప్తుడు' అంటూ అతినారపు హరిశంకర్ తమ కవితను తీర్చిదిద్దారు.

తెలంగాణ తొలిదశ పోరాటానికి ఊపిరైనాడంటూ కొమురయ్య బాలసాని రాస్తే.. 'తెలంగాణ జాతిపిత'గా సురేష్ బచ్చల కూర రాశారు. 'జయహో జయ శంకర్' శీర్షికతో కోలంట్ల రామకృష్ణ రాస్తే.. భూమిపై ఉ దయించిన 'ఉద్యమ తార'గా వర్ణిస్తూ బి. శ్రీలత తమ కవితను రాశారు.

గుడికందుల ప్రకాశం జయశంకర్ ఉద్యమ ప్రస్థానాన్ని తమ కవితలో ఆవిష్కరిస్తే.. 'ఆరాధ్యుడు' అంటూ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి తమ కవితకు రూపమిచ్చారు.

తెలంగాణ ఒడిలో వికసించిన కుసుమం అంటూ స్వప్న మేకల రాస్తే.. మణిపూసలు రూపంలో గాండ్ల వీరమణి తమ భావాలను అక్షరబద్ధం చేశారు.

జయశంకర్ ఆశయ సాధన.. నేటితరం కర్తవ్యమంటూ అయినంపూడి శ్రీలక్ష్మి, డా॥ గౌరవరాజు సతీష్‌కుమార్, కందికట్ల శ్రీనివాసులు, బండాపు మన్మథరావు, నాగిరెడ్డి అరుణజ్యోతి, డా॥ బి. సుధాకర్, జి. శాంతారెడ్డి, గండికోట సుధీర్‌కుమార్, లేదాళ్ళ రాజేశ్వర్‌రావు, ముడావత్ గణేష్, బిరుదుల ప్రవీణ్‌కుమార్, మార్గం కృష్ణమూర్తి, నూనె రాజేశం, పాలకుర్తి వసంత, ఆందోల్ పుష్పలీల రేవతి, తదితరులు రాసిన కవితలు, గేయాలు గ్రంథానికి శోభను కూర్చాయి.

చాలా కవితల్లో కవిత్వాంశ కొరవడిన ప్పటికీ.. ఆచార్య జయ శంకర్‌గారి పట్ల కవులు, కవయిత్రులు ప్రకటించిన శ్రద్ధాభక్తులను ప్రశంసించి తీరుతాం.. కొన్ని కవితల శీర్షికలకు.. ఆ కవితల్లో పొందు పరిచిన అంశాలకు పొంతన లేకపోయినా.. కొత్తగా కలంపట్టి 'కొత్తపల్లి'ని కొనియాడుతూ రాయడాన్ని అందరం ప్రోత్సహించి తీరుతాం.. ఈ సంకలనంలోనే రాయడం ప్రారంభించిన కొత్తవారు తమ రచనలను ఆపకుండా రచనా వ్యాసంగాన్ని కొనసాగించాలని కోరుకుందాం.. కవిత్వ సృజనలో మరిన్ని మెలకువలు తెలుసుకుని మున్ముందు గాఢమైన కవిత్వాన్ని అందిస్తారని ఆశిద్దాం.. మంచి పుస్తకాన్ని తెచ్చిన తెలుగు భాషా చైతన్యసమితిని అభినందిద్దాం..

ప్రతులకు: తెలుగుభాషా చతైన్య సమితి
2-3-104/ఎ/74
ప్రేమ్‌నగర్ కాలనీ, అంబర్‌పేట
హైదరాబాద్-13
సెల్: 9160607662

- దాస్యం సేనాధిపతి
సెల్: 94405 25544

పురాణ పురుషుల గాథలు..

పుస్తక సమీక్షలు

ఏదేని ఒక పుస్తకాన్ని చేతిలోకి తీసుకొని మొదలు గమనించేది ఆ పుస్తకానికి శీర్షిక. అది తలతో సమానం. అందుకని శీర్షిక ప్రాధాన్యత ఇంతా అంతా కాదు. పుస్తకంలో ఇవ్వబడిన వస్తువుతో పూర్తిగా కలిసి పోవాలి. రెంటి మధ్య సంబంధం అతుకులా ఉ ండకూడదు. రచయిత కొమరవోలు శేష శ్రీరామ చంద్రమూర్తి ఈపుస్తకం శీర్షికను 'మనం మరచిన మణభంజికలు' అని, వివరణాత్మకంగా శీర్షిక క్రింద బ్రాకెట్‌లో తెలిసీ తెలియని పురాణ గాథలు అన్నారు. 'భంజిక' అన్నపదానికి నిఘంటువు అర్థం 'స్త్రీ' అని ఉంది. మణుల్లాంటి 'భంజికలు' ల్లాంటి కొందరికి తెలిసినివి, మరికొందరికి తెలియనవి పురాణగాథలు ఇందులో ఇచ్చానని రచయిత చెప్పుకున్నారు. భోజరాజు చెప్పిన విక్రమార్క కథలు స్ఫురణకు రావటం వల్ల సాలభంజికలు' చెప్పిన కథలకంటే ఇవి అపురూపమైనవి కనుక మణిభంజికలుగా పేర్కొన్నానని రచయిత భావం. అయితే, భోజరాజు కథల్లో సాలభంజికలు చెప్పిన కథలు మనోల్లాసాన్ని కలిగించేవే అవటం గమనార్హం.

సంపుటిలో 18 పురాణ గాథలున్నాయి. ఇవి భగీరథుడు (త్రిపథగ) విశ్వామిత్రుడు (బ్రహ్మర్షి విశ్వామిత్ర) హయగ్రీవుడు (హయగ్రీవుని కథ) వృత్రాసురుడు(వృత్రా సురసంహారం) ధృవుడు మరియు విదురుడి లాంటి పురాణ పురుషుల గురించి చెబుతాయి. వీరందరు మంచీ చెడులకు ప్రతీకలై, ఎంతటి గొప్ప వారైనా, తపః సంపన్నులైనా, అరిషడ్వర్గాలకు ఎలా లొంగిపోయి ప్రవర్తిస్తారో వివరించారు. ఇంతటి వారిని 'భంజికలు'గా (సాలభం జిక-వస్త్ర) దంత ఖాష్టాదులచే చేయబడిన బొమ్మ) రచయిత సూచించటం సరికాదని నా అభిప్రాయము. ప్రముఖ సాహితీవేత్త డా॥ ఎలనాగ గారి ఆలోచన ప్రకారం 'మంచి శీర్షికలు పాఠకుడిని ఆకట్టుకోవాలి. చదివించాలి. శీర్షికకు, లోపలి వస్తువుకు పొసగనితనం ఉండకూడదు. స్వంత పిల్లలకు పేర్లు పెట్టేప్పుడు



ఎంతటి శ్రద్ధ తీసుకుంటామో, అంతటి శ్రద్ధ తీసుకోవాలంటారు.

ఇక 18 ఆధ్యాయాలలో పౌరాణిక పాత్రలను వివరించిన తీరు బావుంది. సామాన్య పాఠకుడికి తెలియని విషయా లెన్నింటినో రచయిత తెలియజేసారు.

మచ్చుకు కొన్ని:

మూడు ప్రవాహాలుగా గంగానది ప్రవహించుట చేత త్రిపదగ అని



కనరాని లోకాలకు ఎగిరిపోయిన 'మైనా'

అక్షర ప్రాంగణమే తన చిరునామాగా, రంగుల ప్రపంచమే విహారస్థలిగా ఆరు దశాబ్దాల సాహిత్య ప్రస్థానానికి స్వస్తి పలికి 'మైనా' కనరాని లోకాలకు ఎగిరి వెళ్ళిపోయింది. ప్రముఖ, కవి, కథకుడు, నవలా రచయిత, చిత్రకారుడు శీలావీర్రాజు జూన్ నెల ఒకటవ తేదీన స్వర్గస్థులైనారు. నివ్వెరబోయిన కళారంగం నివాళులు అర్పిస్తు దుఃఖాశ్రువులు రాలుస్తూనే వుంది.

ఎనిమిది కవితా సంపుటాలు, తొమ్మిది కథాసంపుటాలు, నాలుగు నవలలు, వ్యాస సంపుటి, అసంఖ్యాక రేఖాచిత్రాలు, వేయికి పైగా గ్రంథాలకు ముఖ చిత్రాలంకరణ.. యిలా అనేక ప్రక్రియల్లో ప్రతిభావంతుడైన బహుముఖ ప్రజ్ఞాశాలి శీలావీర్రాజు మరణం ఎవ్వరూ పూడ్చలేని లోటు. నిబద్ధత, నిజాయితీ, నిరాడంబరత, నిగర్వం ఆయనకు పెట్టని ఆభరణాలు.

గొప్ప వ్యక్తిత్వం వీర్రాజు సొత్తు. మితభాషి. మాట్లాడిన రెండు మాటలు అర్థవంతంగా, స్ఫూర్తి దాయకంగా వుండేవి.

ఆయనతో నా పరిచయం ఓ దశాబ్దకాలం. 2012 సం॥లో నా నానీల సంపుటి 'జీవన సందర్భాలు'కి ముఖచిత్రం గీయమని అడగటానికి డా॥ ఎన్.గోపి గారితో కలిసి వారింటికి వెళ్ళాను. అప్పటికే గ్రంథాలకు ముఖచిత్రాలు సమకూర్చడం మానేశారు వీర్రాజు. ఆవిషయమే చెప్పారు. నా ముఖంలో నిరుత్సాహాన్ని గమనించి సరే.. యిచ్చి వెళ్ళండి' అన్నారు. ఓ వారం తర్వాత ఫోన్ చేశారు. 'ముఖచిత్రం ఎలా వుండాలని మీ అభిప్రాయం?" అని అడిగారు. "నానీలన్నీ జీవన సందర్భాల్లోంచి ఉద్భవించినవి. మీకెలా తోస్తే అలా గీయండి" అని అభ్యర్థించాను.

హాస్యం, రౌద్రం, కోపం, విషాదం, నిర్వేదం.. యిలా 12 ముఖ కవళికలతో ముఖచిత్రాలంకరణ చేసిన సృజనశీలి వీర్రాజు. యివన్నీ మనిషి జీవన క్రమంలో ఎదురయ్యే సందర్భాలే. గ్రంథావిష్కరణ సభ జరిగింది. ఆవిష్కర్త మహాకవి సినారె.. సభాధ్యక్షులు డా॥ఎన్.గోపి. ఎప్పుడొచ్చారో.. వీర్రాజు సభలో చివరి వరసలో కూర్చుని వున్నారు. వేదికపైకి ఆహ్వానిస్తే సున్నితంగా తిరస్కరించారు. ఆహ్వాన పత్రికలో ఆయన పేరు వేయకపోవడం యిప్పటికీ నన్ను బాధిస్తూనే వుంటుంది. అతిథులతో బాటు ఆయన్ను సత్కరించాలని సవినయంగా పిలిచాం. అప్పటికే ఆయన సభ నుండి వెళ్ళిపోయారు. "యిలాంటి సత్కారమేదో చేస్తారనే నేను వెళ్ళిపోయాను. నాకిలాంటివి యిష్టం వుండదు" అన్నారు తర్వాత కలిసినప్పుడు. వారింటికి వెళ్ళి పారితోషికం యివ్వబోయాను. నొచ్చుకున్నారు. "మీ మీదప్రేమతో అభిమానంతో ముఖ చిత్రం గీసాను గాని డబ్బు కోసం కాదు "పైగా మీరు నా చిరకాల మిత్రుడు రామడుగు రాధాకృష్ణమూర్తిగారి బంధువు కూడా" అన్నారు. నామనస్సు చివుక్కుమంది. అపరాధిలా నిలబడ్డాను.

శీలావీర్రాజు గారు ముక్కుసూటి మనిషి. దాపరికం లేకుండా మాట్లాడేతత్వం. లేనిది వున్నట్టు మసిపూసి మారేడుకాయజేయడం వారి స్వభావ విరుద్ధం. నేను నా కవితా సంపుటి "నా చిరునామా" వారికి అందజేసాను. ఫ్రీవర్స్‌ఫ్రంట్ అవార్డుకు పరిశీలిస్తారేమోనని ఆశ. కొన్ని రోజుల తర్వాత కబురొచ్చింది" మీ కవిత్వం అవార్డు స్థాయిలో లేదు. పరిపక్వత లోపించింది. పక్కానికొచ్చిన సెగ్గడ్డ చిదికే వరకు ఎలా భరిస్తామో.. అలాగే పరిణతి చెందిన కవిత కాగితం మీద రాలే వరకు ఓర్చుకోవాలి. ఓపిక పట్టాలి. అయినా యిది మీ తొలి ప్రయత్నం కదా! బాగా రాయాలి. రాస్తూనే వుండాలి. అభ్యాసం, అధ్యయనం తోడవ్వాలి" యిదీ కబురు సారాంశం. అప్పట్నుంచి తక్కువగా రాసినా మంచికవిత్వం రాయడానికి ఆయన మాటలే నాకు ప్రేరణ.. స్ఫూర్తి. యిలాంటిదే మరో సంఘటన ఉటంకిస్తాను. ఓ పేరున్న సాహితీవేత్త తన గ్రంథా విష్కరణకు వీర్రాజుగార్ని ముఖ్య అతిథిగా, ఆవిష్కర్తగా ఆహ్వానించారు. సభలో మాట్లాడుతూ "ఈయన కవిత్వంలో ప్రశంసించడానికి ఏమీలేదు.. అసలు కవిత్వం లాగానే లేదు'' అంటు విమర్శనాత్మకంగా సాగింది ఆయన ప్రసంగం. నాలుగు మంచి మాటలు విందామని ఆశబద్ధ ఆకవికి నిరూత్సాహమే మిగిలింది. వీర్రాజుగారి మీద అభిమానంతో తన తర్వాతి కవితా సంపుటికి కూడా ఆయననే ముఖ్య అతిథిగా ఆహ్వానించాడు ఆకవి. మళ్ళీ చేదు అనుభవమే. ఉన్నది ఉన్నట్టు నిర్మొహమాటంగా మాట్లాడటం వీర్రాజు గారినైజం. బహుశాః ఈ కారణం వల్లే కావొచ్చు... ఆయన సాహిత్య సభలకు దూరంగా వుండేవారు.

నేనుండే ప్లాట్స్‌లో నివసించే వారి మిత్రుడు రామడుగు రాధాకృష్ణమూర్తి గారిని కలుసుకోవడానికి తరచుగా వస్తూ వుండేవారు వీర్రాజు. అప్పుడప్పుడు మా యింట్లోకి కూడా తొంగి చూసేవారు. Sugerless coffee చప్పరిస్తు ఆయన చెప్పే కబుర్లను ఓ విద్యార్థిలా వింటు వుండేవాడ్ని. ఆయన జీవితంలోని ఎత్తుపల్లాలు, సాహిత్య ప్రస్థానంలోని విశేషాలు వల్లే వేస్తుంటే మానసికోల్లాసానికి, వ్యక్తిత్వ నిర్మాణానికి పాఠాలుగా అనిపించేవి.

"నిబద్ధత, నిజాయితీల సమ్మేళితం ఒక అసంబద్ధ నిజం" శీర్షికన ఆయన కవితా సంపుటిపై 'నేటినిజం' పత్రికలో ఓ సమీక్షావ్యాసం రాశాను. "చాలా బాగా రాశారు.. నా ఆత్మను పట్టుకున్నారు. కృతజ్ఞతలు" అంటు ఫోన్ చేశారు. ఆ ప్రశంసను నాగుండెల్లో భద్రంగా దాచుకున్నాను.

మరో అనుభవం. బషీర్‌బాగ్, వర్కింగ్ జర్నలిస్టుల భవనంలో శీలా వీర్రాజుగారు ఓ సాహిత్య సభ నిర్వహించారు. బహుశాః ఆయన గ్రంథాల ఆవిష్కరణ సందర్భం అనుకుంటాను. ఆహ్వానితులందరూ నిష్ణాతులైన కవులు, కవయిత్రులు, రచయిత(త్రు)లు.అగ్రేసర కవులు కె.శివారెడ్డి, ఎన్.గోపి గారలతో బాటు ప్రముఖులెందరో హాజరయ్యారు. సభికుల్లో ప్రతిఒక్కరూ వేదికపైన కూర్చోదగ్గ అర్హులే. కాని విశేషం ఏమిటంటే వేదికపైన ఆశీనులైన వారందరూ వీర్రాజుగారి చిరకాలమిత్రులు. ఎవ్వరూ సాహితీవేత్తలు కాదు. కానీ సాహిత్యాభిమానులు.. ముఖ్యంగా వీర్రాజుగారి హితులు. కనుల పండువగా జరిగిన ఆ నిండుసభ వీర్రాజుగారి స్నేహాభిమానానికి అద్దంపట్టింది. స్థాయీ భేదం మరచి అందరూ ఆసాంతం ఆస్వాదించిన గొప్ప సాహిత్యసభ. సాహిత్య లోకంలో సాహితీవేత్తలకు వీర్రాజుగారి పట్ల ప్రేమాభిమానాలు, గౌరవం చాటిచెప్పిన సభ.

మరో సంఘటన గుర్తుకొస్తోంది. రవీంద్రభారతి పక్కన కళాభవన్‌లో వీర్రాజుగారి చిత్రకళా ప్రదర్శన జరిగింది. డా॥ఎన్.గోపి ప్రారంభకులు. గోపి వెంబడి నేను కూడా వున్నాను. మా వెంటే గ్యాలరీ చుట్టు తిరుగుతు ఛాయ చిత్ర విశేషాలను దగ్గరుండి వివరించారు. "బెస్ట్ హెల్ప్".

వివిధ సందర్భాల్లో ఆయన రాసిన పుస్తకాలను నాకిచ్చారు. ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ అవార్డు పొందిన 'మైనా' నవల ఎన్నిసార్లు చదివానో లెక్కలేదు. అద్భుతమైన శైలి. చదవడం మొదలెడ్తే చివరి పుట వరకు ఏకబిగిన చదివించే గొప్పనవల అది. ఆయన సృజించిన 'కొడగట్టిన సూర్యుడు' కవితా సంపుటి చదవడం గొప్ప అనుభవం. 'ఫ్రీవర్స్‌ఫ్రంట్' మొట్టమొదటి అవార్డు పొందిన సంపుటి యిది. 'శీలావీర్రాజు చిత్రకారీయం' వర్ణ చిత్రాల ఆల్బమ్ నా వ్యక్తిగత గ్రంథాలయంలో తలమానికంగా నన్ను నిత్యం పలకరిస్తూనే వుంటుంది. యిలా రాస్తుపోతే ఎన్నో జ్ఞాపకాలు. ఆయన సాహిత్యాన్ని తడుముతూపోతే ఓ ఉద్గ్రంథం అవుతుంది. వీర్రాజుగారి మరణంతో ఓ మేరు పర్వతం నేలకొరిగిందని సాహితీవేత్తల ఏకాభిప్రాయం.

వ్యక్తిగా మహోన్నతుడు. మొహమాటం లేని సద్విమర్శకుడు. నిరాడంబరతకు చిరునామా. స్నేహశీలి. వివిధ ప్రక్రియల్లో నిష్ణాతుడు. శీలావీర్రాజు వ్యక్తిత్వం, సాహిత్యం ఎందరికో ఆదర్శప్రాయం.. స్ఫూర్తిదాయకం. ఆ మహనీయుడి మృతికి సంతాపాన్ని ప్రకటిస్తు వారి ఆత్మకు శాంతి చేకూర్చాలని భగవంతుణ్ని ప్రార్థిస్తు, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని ప్రకటిస్తు.. వీర్రాజు గారిదివ్య స్మృతికి యివే నివాళులు..



– రమణ వెలమకన్ని
సెల్: 9866015040

2004లో 'నేటినిజం' స్వాతంత్ర్య దినోత్సవ ప్రత్యేక సంచికలో శీలావీర్రాజు గురించి డా॥ నాళేశ్వరం శంకరం రాసిన వ్యాసం

మన వచన కవనపు జీవధార

శీలావీర్రాజుగారి యాభైయేళ్ళ రచనా జీవితంలో సృజించిన ప్రయోగాత్మక కవితా కట్టడాలను సందర్శించిన అపురూప సందర్భాలే కాక ఆయన కవిత్వం పఠించినప్పుడు స్వయంగా పరవశించిన సందర్భాలు, ఉద్విగ్నతకు లోనైన క్షణాలను మీతో పంచుకోవాలనే తపనంతో ఈ ప్రయత్నం చేస్తున్నాను.

శీలావి రచనా జీవితంలో సాధన చేసిన రూపాలు ఎన్నో వున్నాయి. సాధనచేసి వొదిలేసిన కొన్ని రూపాల్ని పక్కనపెడితే మిగిలిన ప్రతి సాహిత్యరూపంలోనూ తనదైన ఒక వినూత్న రహస్య రహదారిని నిర్మించడంలో తలపండిన కృషీవలుడాయన. ఆయనకు కృషిపట్ల ఉన్న ప్రేమ కీర్తిపట్ల లేదు. అయినా ఆయన సాధించిన సరికొత్త ప్రయోగాలనైనా విమర్శకులు గుర్తించినట్లు లేదు. సాహసంచేసి అనాలంటే అతని సన్నిహిత సాహితీవేత్తలు కూడా ఆయన సాహిత్యాన్ని విశ్లేషించిన ఆనవాళ్ళు లేవు. ఆయన మంచి కథారచయితనీ, ఆ తరువాతే నవలా రచయితనీ, ఆ తరువాతే చిత్రకారుడనీ, కనీ, ఆపైన అదనీ యిదనీ అంటూ పొడి పొడి అక్షరస్పర్శ చేసేవాళ్ళంటే నాకెందుకో ఇష్టం ఉండదు. వివిధ రూపాల్లో ఒక పరిపక్వతను సాధించిన శీలావికి తగిన గౌరవం యెందుకు లభించలేదో నాకిప్పటికీ అర్థం కాని విషయమే.

శీలావి సమగ్ర సాహిత్యం గూర్చి యే అవగాహన లేనివారికోసం కాస్తంత తెలియజెప్పవలసిన అవసరముంది.ఆయన ఇప్పటి వరకు యెనిమిది కథా సంపుటాలను, నాలుగు నవలలను, ఆరు కవితా సంపుటాలను వెలువరించారు. వివిధ రూపాల్లో రెండున్నర వేల పేజీలకు మించి పద్దెనిమిది సంపుటాలను సృజించారు. ఇవికాక శిల్పరేఖ అనే ఒక లేపాక్షి స్కెచ్‌ల పుస్తకం, కలానికి అటూ ఇటూ అనే ఒక వ్యాస సంపుటితో పాటు మరికొన్ని రచనలు కూడా వున్నాయి. ఆంగ్లంలోకి, భారతీయ భాషల్లోకి కొన్ని రచనలు అనువాదమైనాయి. ఇరవయ్యవ శతాబ్దంలో లెక్కించదగిన తెలుగు నవలల్లో శీలావి 'మైనా' నవల కూడా ఒకటి అత్యుత్తమ నవలా పీఠం మీద నిలుచోగలిగినప్పటికీ ఆయన నవలా రూపానికి గుడ్‌బై కొట్టేసి తన శాశ్వత చిరునామా వచన కవిత్వ కవనభూమేనని గాఢంగా విశ్వశించారు. కొడిగట్టిన సూర్యుడు, హృదయం దొరికింది, మళ్ళీ వెలుగు, కిటికీ కన్ను, ఎర్రడబ్బారైలు, పడుగు పేకల మధ్య జీవితం అనే కవితా సంపుటాలను, మరికొన్ని కవితల్ని కలిపి ఒకే ఒక్క కవితా సంపుటిని తీసుకు రావాలన్న మహాసంకల్పానికి ప్రతిరూపమే ఈ అపురూప మహా సంపుటం.

శీలావి రచనా జీవితంలోని ప్రారంభ ప్రయాణాలు కథ, నవలా రూపాలతో మొదలైనా స్థిరపడింది మాత్రం కవితారూపంలోనే. ఇది యాదృచ్ఛికంగా జరిగిందికాదు. రూప ప్రతిభా విస్తృతిలో ఉండే స్థిరదృష్టికి సంబంధించిన విషయం. ఈ విస్తృత స్వభావం గ్రాలిఎటంగా మొదలైతే కథలు రాశాను. నవలలు రాశాను. మిగిలింది కవిత్వమే కనుక కవిత్వంకూడా రాస్తాననే అన్‌సీరియస్ పొయట్ స్వభావం ఆయనలో లేదు. శ్రీశ్రీ, ఆరుద్ర, అజంతా, కుందుర్తి వంటి కొద్ది మంది కవుల ప్రయోగాల్ని పక్కన పెడితే శీలావీర్రాజు చేసినన్ని ప్రయోగాలు ఆయన తరువాత వచ్చిన యే కవి చేయలేదు. వచన కవితలు, వచన కవిత్వ కథలు, దీర్ఘ కవితలు, దీర్ఘకావ్యాలు, వీటితోపాటు తన ఆత్మకథను సైతం వచన కవిత్వంలో రాసిన ప్రయోగవాది శీలావీర్రాజుగారే.

ఈ ప్రయోగవాదికి కవిత్వం బాల్యంలోనే పట్టుబడింది. ఆయన ముద్రితమైన తొలి రచన కూడా వచన కవితే. కవికీ, రచయితకీ ఉండే ప్రధాన గుణ స్వభావాలు ఆయనలో పుష్కలం. అవివొక్కోమారు విడివిడిగానూ, వొక్కోమారు యేకసూత్రతోనూ అగుపిస్తాయి. వచన కవిత్వ సుసంపన్నతకు ప్రయోగాలు అవసరమని గుర్తించి, వివిధ సాహిత్యరూపాలు వచన కవిత్వ పురోగతికి యేయే మేరకు తోడ్పడగలవో గుర్తించి, వాటిని వచన కవితా రూపానికి వాడుకున్న కవి శీలావి. కథా బీజాల్ని కవిత్వంలోకి మలిచే రహస్యాలను వెలికి పట్టుకున్నారాయన. చిత్రలేఖనంలోనూ, వచన రచన రూపాల్లోనూ సంపాదించిన స్వానుభవాన్నంతా వచన కవిత్వ కథల ప్రయోగాలకుపయోగించి కొడిగట్టిన సూర్యుడు, హృదయం దొరికింది అనే రెండు కవిత్వ కథా సంపుటాలను వెలువరించడం వల్లే ఆయనను ప్రయోగవాద కవిగా నిలపడానికి ఒక ప్రధాన కారణమైంది.

ఈ కవిత్వ కథల్లో కవితారూపం, కథారూపం కలగలిసిపోయి బియ్యపు గింజమీద తాజ్‌మహల్‌ను చెక్కినట్టుంటాయి. వీటిలో సంభాషణలు తక్కువ. రెండింటికి మించి పాత్రలుండవు. ఉన్నా ప్రధాన పాత్రలకు అనుబంధమైనవే. సందర్భాలు, సన్నివేశాలు, వాతావరణం అన్నీ కూడా మబ్బుల వెనక సూర్యుడు అదృశ్యమైఉన్నట్లుగానే ఉంటాయి. ప్రతీదీ భావ ప్రాధాన్యం గల కవిత్వ కథే. కొడిగట్టిన సూర్యుడు, ముళ్ళరెమ్మ, విశ్వాసం నీడకింద, అద్దాలగుహ, హృదయం దొరికింది. అద్దెగది వంటి కవిత్వ కథల్లో కవనకళనేత అతిసున్నితమైంది, సరళమైంది. ఈ కథా కవిత్వాలలో విఫలమైన స్త్రీ పురుష ప్రేమ సంబంధాలు, స్నేహ సంబంధాలు, మానవీయ సంబంధాల వెనుక అధీకృతమైన సమాజాన్ని కవి విశ్లేషించిన తీరు విలోణమైంది. శీలావి మీద బుచ్చిబాబు ప్రభావం అక్కడక్కడ ఉన్నా, కవిలోని మనోధార పాత్రలోకి ప్రవేశించడంవల్ల పాఠకుడు బలమైన ఉద్విగ్నతకు లోనవుతాడు. 'కొడిగట్టిన సూర్యుడు' లోని కృష్ణవేణి, పార్వతీశం పాత్రల ఆశలు నిరాశలు మనల్ని ఒక కుదుపు కుదుపుతాయి. కృష్ణవేణి ఆసుపత్రిలో పనిచేసే ఒక సాధారణ నర్సు. పార్వతీశం పేషెంట్. పార్వతీశం కృష్ణవేణి పెంచుకున్న మమకారాన్ని కవి యెంత ఉద్విగ్నంగా వర్ణించాడో చూడండి– "సుప్రభాతం పలుకుతూ అతన్ని లేపబోయి, ఎంతకీ కదలని అతని మీద చూపుల్తో ఎర్రటి చురకవేసి, అల్లుకున్న దట్టమైన చీకటిని తరుముకుంటూ పరుగుపెట్టి, ఉప్పెనలా డ్యూటీ గదిలోకి చొచ్చుకుని వచ్చి, రాత్రి టేబుల్ మీదపెట్టిన ట్రేలోకి చూపుల్ని పారేసింది కృష్ణవేణి. అక్కడ ఆమె చూపులు పడినచోట మూడు మార్చియా నిండు సీసాల్లోనూ ఒకటి, ఒక్క చుక్కతడన్నాలేని ఎండిపోయిన చూపుల్తో శూన్యంగా మిగిలిన యింకిపోయిన హృదయంతో, పాలిపోతున్నట్టు జీవంలేని నవ్వు నవ్వుతోంది'' పార్వతీశం తనవల్లే చనిపోయాడనుకుంది. కృష్ణవేణిలోని ద్రవీభూతమ వుతున్న మమకారాన్ని కవి వర్ణించిన తీరును మనమెప్పటికీ మరచిపోలేం.

శీలావి మనోవర్ణన చేయడంలో దిట్ట. లోపలి మనిషిని తనదైన వర్ణనతో వెలికితీయగల సమర్థమైన కవి. కొడిగట్టిన సూర్యుడులోని కృష్ణవేణి పాత్రేకాదు ఆయన కవిత్వకథల్లోని యేపాత్ర మనస్తత్వమైనా ఒక తాత్విక మనోలోయలోకి మనల్ని లాక్కుపోతుంది. ఇవి వాస్తవ జగత్తులోని పాత్రలే అయినప్పటికీ ఆ పాత్రల ఆదర్శ జగత్తును మనమెంత నిర్లక్ష్యం చేస్తున్నామో తెలుసుకోగలుగుతాం. జీవితంలో ఆ పాత్రలు వైఫల్యం చెందినందుకు వ్యథకు లోనవుతాం. కదిలించే బాధకు కవి. గురిచేయడమే కవిత్వానికి ప్రయోజనం కదా! ఆ ప్రయోజనం పావని, శ్రీనివాసు, దమయంతి, బాలకృష్ణ, వందన, రవి వంటి యెన్నో పాత్రలు నెరవేరుస్తాయి. శీలావి కథా కవిత్వంలోని సెంటిమెంట్స్, కల్పనలు, సౌందర్యోపేత వర్ణనలు మనల్ని ముగ్ధుల్ని చేస్తాయి. శీలావి వచన కవిత్వ కథలన్నీ –1965–70 మధ్య కాలంలో వచ్చాయి. ఈకాలంలోనే వచ్చిన దిగంబర కవిత్వోద్యమం, వచన కవిత్వోద్యమం తెలుగు సాహిత్య చరిత్రనే మార్చివేశాయి. వచన కవిత్వోద్యమాన్ని నడిపించిన కవన నాయకుడు కుందుర్తి. ఆయన చేపట్టవలసిన ప్రయోగాలను శీలావి చేపట్టినందుకు చేరదీశాడు. ఆయన ఉద్యమానికి సరియైన వారసుడు శీలావియేనని సాహితీలోకం గుర్తించింది.

మరో విషయం దిగంబర కవిత్వోద్య మానికీ, వచన కవిత్వోద్యమానికీ సాహిత్యం కన్నా వాటి మధ్యన వైరుధ్యాలే యెక్కువ. ఈ రెండు ఉద్యమాల ఆశయాల ఎవేరు వేరు. అయితే ఇవి వచన కవిత్వ వస్తురూపాల్ని మార్చివేశాయి. వచన కవిత్వోద్యమం రూపాన్ని మార్చాలని పూనుకుంటే దిగంబరోద్యమం వస్తువును మార్చప్రయత్నించింది. ఈ అనివార్య సందర్భం మూలంగా వచన కవిత్వ వస్తురూపాలు మారిపోయాయంటే ఆయా ఉద్యమాలలోని వాళ్ళు అంగీకరించక పోవచ్చు.ఈ సందర్భంలోనే విప్లవ రచయితల సంఘం బలోపేతమైంది. విప్లవ సాహిత్యోద్యమం విస్తరించింది. దిగంబర ఉద్యమం, వచన కవిత్వోద్యమం కనుమరుగైపోయాయి. ఈ ఉద్యమం వల్ల శీలావి రచనావిధానంలో మార్పు వచ్చింది. వర్గసమాజంలో తానేటువైపుఉండాలో, యెవరి బాధలపల్లవిని వినిపించాలో గుర్తించారు. శీలావి యెక్కడా చెప్పుకోలేదుకాని ఈ ఉద్యమ ఫలితంగానే 'మళ్ళీ వెలుగు' అనేకావ్యం ఆవిర్భవించింది. అయితే ఇది విప్లవ కవిత్వం కాదు. వర్గదృష్టి నిండుగాఉన్న కవిత్వం. శీలావి కథాకవిత్వాన్ని వొదిలేసి ఒక సరికొత్త కార్యరూపప్రయోగానికీ స్వీకారం చుట్టారు. 'మళ్ళీ వెలుగు' కావ్యరూపానికీ, కావ్యవస్తువుకూ ఒక కొత్త మార్గం చూపింది. 'హృదయం దొరికింది' రాసిన కవేనా యీ మళ్ళీ వెలుగు రాసినకవి అనేంత ఆశ్చర్యం వేస్తుంది.

ఇదివరకు నగరజీవితం మీద కవిత్వం రాసినవాళ్ళు లేకపోలేదు. కానీ నగర ప్రజల జీవన విధానంలోని ఒకదిన్నాన్ని, ప్రధాన కథా వస్తువుగా యెన్నుకుని ఒకదిన్నాన్ని, ప్రధాన కథావస్తువుగా యెన్నుకుని ఇంత ప్రతీకాత్మక కావ్యంగా రాసినవాళ్ళు లేరు. ఈకావ్యానికీ సార్వజనీనత ఉంది. ప్రపంచంలోని యే నగర జీవితమైనా ఉదయమ నుంచి ఉదయందాకా యిలాగే ఉంటుందనే ఒక సార్వజనీన నగర జీవనంపై యేర్పడే ఒకవిధమైన భావన కల్గుతుంది.శీలావి 'మళ్ళీ వెలుగు' కావ్యాన్ని ప్రారంభిస్తూ ఇది "ఒక వర్ణనాత్మక కావ్యం. ఉషస్సునుంచి అర్ధరాత్రి వరకు నగర జీవితాన్ని అద్దంపట్టి చూపించే ప్రయత్నం చేశాను. కేవలం నగర జీవిత చిత్రనే నాఉద్దేశ్యం కాదు. ముఖ్యంగా యిది ధ్వని ప్రధానమైన కావ్యం. ఒక్కొక్క సమయాన్నీ ఒక్కొక్క సామాజిక స్థితికి చిహ్నం గా అన్వయించి సాగించిన రచన ఇది. ఉషస్సు ఆశకు, ఉదయం చైతన్యానికీ, మధ్యాహ్నం అధికారానికి, సాయంత్రం ఆకర్షణకు, సంధ్య పతనానికి, రాత్రి పాపానికీ, అర్ధరాత్రి జడత్వానికీ సంకేతాలుగా స్వీకరించి" రాసిన కావ్యంగా చెప్పుకున్నారు.

ఇరవై నాలుగు గంటల్లో ముగిసే ఈ మళ్ళీ వెలుగు, సరికొత్త కావ్యాలకు ద్వారాలూ, కిటికీలూ తెరిచింది. ఈ కావ్యం యేకకాలంలో రెండు ప్రయోజనాల్ని నెరవేరుస్తుంది. ఒకటి–కావ్యప్రధానమైన ప్రయోజనం, రెండు–దీర్ఘ కవితా ప్రయోజనం, ఉషస్సు, ఉదయం, మధ్యాహ్నం అంటూ విభజించిన ప్రతి భాగం ఒక దీర్ఘకవితే. యేక కాలంలో దీన్ని కావ్యం గానూ, దీర్ఘకవిత గానూ భావించుకోదగిన లక్షణం ఈ "మళ్ళీ వెలుగు'లో గ్రహించగలం. కుందుర్తి 'నగరంలో వాన' అనే దీర్ఘ కవిత ఒక సందర్భాన్ని మాత్రమే వ్యక్తం చేస్తుంది. శీలావి నగర జీవితం విస్తృతమైంది. ఔచిత్యంకోసం యే విశ్లేషణ అవసరంలేని కొన్నిపాదాల్ని పొందుపరుస్తాను.

'మన్నుతిన్న జెర్రిగొడ్డు నగరం', నగరాన్ని 'అర్ధరాత్రి ఆకాశం నుంచి చూస్తే అచ్చం ఆకుల్లేని మోడైన చెట్టులాగే ఉంది' నగరంలోని రోడ్లు 'పదిమందిని చూస్తేగాని దానం చెయ్యని పెద్దమనిషి హృదయం లాంటివి'. నగరం రంగులు పరిచిన బృందావనంలా వుంది. పరిమళాలు చల్లే పూలవనంలా వుంది', నగరంలోని యాంత్రిక జీవన విధానానికి అనువైన నగర వర్ణనల్నీ, ఆ మానవీయ జీవన శైలినీ వర్ణించే వర్ణనలను, ప్రభుత్వ కార్యాలయాల్లో జరిగేపనినీ, రాత్రిపూట నెలకొనే వ్యభిచారం, పాలకుల దుర్నీతి, సంపన్నుల చీకటి బజారును వర్ణించిన పాదాల్ని మరిన్నైనా ఈ కావ్యంలోంచి యెత్తి చూపగలను.

శీలావి 'మళ్ళీ వెలుగు' తరువాత వచ్చిన మరోకావ్యం 'పడుగు పేకల మధ్య జీవితం', ఇది వచన కవిత్వంలో వచ్చిన తొలి ఆత్మకథ. వచన కవిత్వంలో ఇప్పటి వరకు ఆత్మకథలు రాసినవి లేవు. ఇదే మొదటిది. శీలావి తన ఆత్మకథాత్మక స్వీయ చరిత్రను తొలిసారిగా వచన కవితా రూపంలో ప్రయోగం చేయడం ముదావహం. పద్యకవిత్వంలో స్వీయ చరిత్రలు వచ్చాయి కానీ వచన కవిత్వంలో రాలేదు. దీనికి శాశ్వతమైన పేరు రావడానికి వీలుంది.

పడుగు పేకల మధ్య జీవితం అనగానే చేనేత వంశంలో జన్మించిన ఒక చేనేత కార్మికుని జీవితకథ కావచ్చునని అనుకోవడానికి ఆస్కారంఉంది. శీలావి చేనేత కులస్తుడే అయినా ఆ కులవృత్తిలో జీవించలేదు. కథ, నవల, కవిత్వ కలనేత కళాకారునిగా యెదిగిన శీలావి ఆత్మకథగా దీన్ని గుర్తించాలి. బాల్యంనుండి వివాహం దాకా జీవించిన తన లోపలి, బయటి ప్రపంచాన్ని ఆవిష్కరించారు. ఆత్మకథ అన్నప్పుడు అన్నీ నిజాలే రాయాలి. ఆ వాస్తవాల్ని కవిత్వంలో వ్యక్తీకరించేటప్పుడు కవిత్వానికుండే ఎమోషన్స్, ఇమాజినేషన్స్ వంటి సున్నితమైన స్వాప్నిక జగత్తు స్వీయ చరిత్రలో చొరబడి వాస్తవం అవాస్తవంగానూ, అవాస్తవం వాస్తవంగానూ రూపాంతరం చెందే ప్రమాదం ఉంది. అందువల్లే కవిత్వంలో ఆత్మకథలు రాయరు. శీలావి ఈ సమస్యను అధిగమించారు. కవిత్వంవెంట శీలావి ఆత్మకథ వెళ్ళదు. ఆయన ఆత్మకథ వెంటే కవిత్వం వెంటపడుతుంది. చిన్నతనంలో ఒక మిత్రుడు ఆయన తొలిపుస్తకం అచ్చువేస్తానని అన్నప్పుడు యెగిరి గంతులు వేసుకుంటూ వెళ్ళారు. భోజన సందర్భంలో వీధి అరుగు మీద విస్తరివేసి వడ్డించిన పద్దతిని చూసి బాధపడ్డారు. అచ్చువేసుకునే స్తోతమత లేకపోయినా వ్యక్తిత్వాన్ని మాత్రం కాపాడుకున్న అభిమాన ధనుడాయన. ఒక రేడియో స్టేషన్ అధికారి ఒక సందర్భంలో అవమానించేటట్లుగా ప్రవర్తిస్తే ఇప్పటికీ రేడియో వాళ్ళు యెన్నిసార్లు రికార్డింగ్‌కు ఆహ్వానించినా వెళ్ళలేదు. అంతేకాదు దిగంబరకవుల మీద చేసిన వ్యాఖ్యలు మరువలేనివి. దిగంబరకవులు "ఆత్మీయ మిత్రులే అయినా ఎంతమాత్రం వాళ్ళ చర్యల్ని సమర్థించని వాణ్ణి. రాజ్యం మీద చూపించాల్సిన కోపాన్ని, సమాజం మీద చూపించడం సరికాదు కదా. అదివారి అవగాహనాలోపమే అనుకోవాలి కదా. అందుకే మూడు పుస్తకాలతోనే మూలబడి పోయింది" వాళ్ళ దిగంబరోద్యమం.

'ముళ్ళకంప మీద కాకరపాదు అల్లుకున్నంత అవలీలగా' రాసిన వచన కవితా సంపుటాలు రెండు, ఒకటి– ఇరవై అయిదు కవితలతో 'కటికీ కన్ను'గా వెలువడితే, మరొకటి–ముప్పైకవితలతో' ఎర్రడబ్బారైలు'గా వచ్చింది. ఈ యాభై అయిదు కవితల్లో దేన్నిముట్టుకున్నా మమకారం తెలిసిన మనిషిలానే ఉన్నాయి. పేదల జీవితాల్ని నిర్భంధిస్తున్నదీ, విధ్వంసం చేస్తున్నదీ, బానిసల్ని మరింత బానిసల్ని చేస్తున్నదీ, తమ బతుకు తమకు కాకుండా చేస్తున్నదీ ఈఅసమ సమాజమే– ఈ సంపన్న సమాజమే అన్న అవగాహనను కలిగించే కవితలివి.

'ఎరుపంటే కొందరికీ భయం భయం' అని ఓ ప్రజాకవి పాట రాస్తే సంపన్నులకు అది మరింత భయాన్ని కలిగిస్తుందంటారు శీలావి. "ఎరుపు వాళ్ళ జీవితం నిండా పరుచుకుంటుంది, ఎరుపు, వాళ్ళ అభిరుచులనిండా అల్లుకుంటుంది, ఎరుపు, వాళ్ళ వొంటినిండా ప్రవహిస్తుంది. ఎరుపంటే వాళ్ళకు వల్లమాలిన మక్కువ, కాని, జానెడు ఎర్రని గుడ్డముక్క మూరెడు కర్రమీద జెండాగా మారి, గాలిలో రెపరెపలాగుతూ కళ్లముందు కనిపిస్తే, ఒకటేభయం, పిచ్చి భయం" అంటారు. కుంకుమ ఎరుపునూ, ఎర్రగులాబీల ఎరుపునూ, ఉంగరాల్లోని కెంపుల ఎరుపునూ, ఎర్రని కంచిపట్టుచీరల ఎరుపునూ చూసి మురిసి పోతారు కానీ జానెడు ఎర్రగుడ్డమీద మూరెడు కర్రమీద జెండాగా మారితే సంపన్నులు యెందుకు పిచ్చిగా భయపడతారో యిదివరకు ఎవరూ చెప్పని విధంగాపామరునికి అర్థమయ్యేట్లు చెప్పారు. వామపక్ష ఉద్యమాలతో మమేకం కాకపోతే ఇంతబలమైన కవిత రాయడం అసాధ్యం. అమెరికా నౌకాదళం ఇరాన్ పౌర విమానాన్ని కూల్చిన సందర్భంలో 'రాక్షసులన్నా కారు' అని ఓ ప్రజాస్వామిక లౌకికవాదిగా అమెరికాను ఖండించారు. శ్రీశ్రీ స్వంత దస్తూరితో మహాప్రస్థానం వచ్చిన పుడు సాహిత్యలోకం హర్షించింది. అయితే శీలావి 'కిటికీ కన్ను' అంతకు యేడాది ముందే స్వదస్తూరితో తొలిసంపుటం తెచ్చినా యెవరూ పట్టించుకోలేదు. ఆయన ఎవరో పట్టించుకుంటారన

– బి.ఎస్.రాములు
సామాజిక తత్వవేత్త
తొలి వైర్మన్, టీసీ కమిషన్,
తెలంగాణ రాష్ట్రం
సెల్: 8331966987

"ఈ నవలలో ఎన్నో పాత్రలు. కొన్ని సజీవ పాత్రలు. మరికొన్ని మాజీ ప్రధాని పీ.వీ. రాసిన 'లోపలి మనిషి' నవలలోలాగ సజీవ పాత్రలను కలగా పులగం చేసిన చిత్రణ. కొన్ని ఊహాత్మక పాత్రలు. కొన్ని ఆదర్శ పాత్రలు. వీటిక్కూడా మూలరూపాలు... లేకపోలేదు" అని రచయిత బి.యస్. రాములు అన్నారు. ఆలోచింపజేసి, చైతన్య పరచే ఈ 'చూపు' నవలను ప్రతిరోజు నేటినిజం పాఠకులకోసం...

– సంపాదకులు.

గార్డెన్‌లో జయ, మనోజ్ ఏకాంతంగా ఉండిపోయారు. మానస ఇంట్లో ఏదో సర్దుతోంది. రమ్య ఇంటికి వెళ్ళిపోయింది. సాయంత్రం ఏడవుతోంది. ఆకాశం బంగారు పూతతో ఎర్రబడుతోంది. చీకటి ఇంకా ముసురుకోలేదు. జయ ఇదే సమయం కోసం ఎదురు చూస్తోంది. ఆ ఏకాంతం ఇవ్వడం కోసమే మానస ఇంట్లోకి ఏదో పనున్నట్లు వెళ్ళిపోయింది.

మళ్లీ సమయం దొరకదు అనుకుంది జయ. తానే ముందుగా బయట పడింది. అందుకు కాస్త సంకోచంగా కూడా వుంది. పూలకేసి చూస్తూ జయ మనోజ్‌ను ఏదో అడగాలనుకుంటోంది. చెప్పాలనుకున్నా... ఎలా చెప్పాలో తోస్తున్నట్టు లేదు.

"మనోజ్! ఇవాళ అమ్మానాన్నలు ఊరికిపోయింద్రు. రెండు రోజుల దాకా రారు. నాకేదో పెళ్లి సంబంధం కోసం అనుకుంటా... సెటిల్ చేసుకొని వద్దామని అనుకుంటుంటే విన్న... వాళ్లు బాగా ఆస్తిపాస్తులు వున్నవాళ్లట.... పెద్ద కాంట్రాక్టరట... ఏదో ఇండస్ట్రీ కూడా వుందట... వాళ్ల నాన్న కొంతకాలం మండలాధ్యక్షుడిగా కూడా చేసిండట..." చెప్పలేక చెప్పింది జయ.

జయ తమ పెళ్ళి ప్రతిపాదన చేస్తుందని ఊహిస్తున్న మనోజ్‌కు ఆ మాట పిడుగు పాటులా శరీరం, మనస్సు ఒక్కసారిగా షాక్‌కు లోనైంది.

క్షణకాలం నోటమాట రాలేదు. జయ ఎటో చూస్తున్నదల్లా మనోజ్ కళ్లల్లోకి చూసింది. ఆ చూపుతో మనోజ్ గుండె పగిలి పోయింది. ఇక వినలేను అన్నట్టు చేత్తో జయ పెదవులు మూశాడు. కళ్లల్లో ఏదో కన్నీటి పొర... తన కన్నీటి పొరతో, తన ఆవేదనతో జయ అంతకన్నా ఎక్కువ లోలోపల బాధపడుతోందని మనోజ్ గమనించలేకపోయాడు.

ఎదిగీ ఎదగని వయస్సు... ఎదగీ ఎదగని మనస్సు... ఆకర్షణ... అభిప్రాయాల కలబోత... సినిమాల గురించి, సాహిత్యం గురించి, లోకం గురించి, స్నేహితుల గురించి, ఎన్ని చర్చించుకున్నారో... ఎంతగా పోటీ పడ్డారో... అప్పుడప్పుడు మానస కూడా పోటీలో గెలిచేది...

ఇండోర్ గేమ్స్... క్యారెమ్స్, చెస్, పచ్చీస్, పేకాట, జోక్స్, చర్చలు, వాదాలు.... జయ, మానస ఒకవైపు... జయ తల్లి సుజాత, మనోజ్ ఒకవైపు... ఎన్ని ఆటలో... ఎన్ని ముచ్చట్లో... అవన్నీ ఎలా మర్చిపోవడం... మనోజ్‌ను సుజాత సొంత కొడుకులా చూసుకునేది... కులాతీతంగా వాళ్లు ప్రేమించుకుంటారని ఆమె ఊహకు అందని విషయం... రెండు కుటుంబాలు కొండగట్టు వన భోజనాలకు, ధర్మపురి గంగ స్నానాలకు, తిరుపతి, శ్రీశైలం, వేముల వాడ, బాసర, కుంటాల జలపాతం, సమక్క, సారక్క యాత్రలకు... అలా ఎన్నిసార్లో... ఎన్నేళ్లో... రెండూ ఒకే కుటుంబంలా కలిసిపోయి...

ఇష్టం లేని పెళ్లి చేసుకోమంటారు... చిన్నప్పట్నుంచి చూసిన పిల్లనే గదా... అన్నీ తెలిసిన వాళ్లే కదా... అని అంటారు. రమ్యను పెళ్లి చేసుకోవచ్చు అని ఒకటే పోరు పెట్టారు... అది స్నేహం... మానసతో రమ్య స్నేహం... రమ్య పట్ల మానస మీద వుండే చెల్లెలి ఆత్మీయతే తప్ప ఎందుకో ప్రేమ వికసించలేదు. బాల్యం నుండి బాగా సన్నిహితంగా వుంటే ప్రేమ భావాలు కాకుండా అంతకన్నా మించిన అనుబంధాలు ఏర్పడతాయేమో! స్నేహంలో ప్రేమలో కన్నా ఎక్కువగా ఎన్నో విషయాలు మాట్లాడుకున్నది అందుకేనేమో... తనకు మానస వేరు, రమ్యవేరు కాదు... ఈ మాట పెద్దవాళ్లకు అర్థం కాదు. అర్థం చేసుకోరు... నువ్వు ఇంత స్నేహం చేశావు... మేం చిన్ననాటి స్నేహితులం... సంబంధం కలుపుకుందాం అని అంటారు... అంతే తప్ప మా హృదయాల్లో ఏముందో తెలుసుకునే ప్రయత్నం చేయరు. ఎన్ని తరాలు గడిచినా... ఎంతమంది ప్రేమ కోసం ఆత్మహత్యలు చేసుకున్నా ఈ పెద్దల బుద్ధులు మారడం లేదు. జయను పెళ్లి చేసుకుంటా నంటే భూమి బద్దలైపోతుందన్నట్టు వ్యతిరేకిస్తారు. అందుకే చెప్పడానికే భయం. నాకే భయమైతే ఆడపిల్ల జయకు తల్లిదండ్రులకు చెప్పడానికి ఇంకెంత భయమో!

మధుసూదన్ అంకుల్ కూతురు మధుప్రియ ఎవరినో ఇష్టపడ్డానని చెప్పి నందుకు అంకుల్ ఏం చేశారు? అది ఇంకా చిన్నపిల్ల అనుకుని చెడామడా తిట్టాడు. అది రెండు రోజులు అన్నం తినలేదు. తల్లి ఎంత బతికాడు. ఏడాదంతా అతడు మనిషి కాలేదు... ఇవన్నీ అమ్మా, నాన్నలకు తెలియవా? తల్లిదండ్రులకు తెలియవా?

వినాయక్ కొడుకు మహేందర్ తనకు ఒక సంవత్సరం సీనియర్. అయినా అరెయ్, తురేయ్ దోస్తులం. వాడు ఎంత సెన్సిటివ్‌గా వుండేది... వినాయక్‌కు గొప్ప స్వేచ్ఛా వాది అని, చాలా ఓపిక వంతుడని, సంస్కార వంతుడని పేరు... కాని తన కొడుకు విషయం వచ్చేసరికి ఏం చేశాడు? అది బతిమాలినా తన పట్టు వీడలేదు. మూడోరోజు ఉదయం లేచిచూసే సరికి ఏముంది? చున్నీని ఉరితాడుగా చేసుకొని ఫ్యానుకు వేలాడు తోంది... అప్పుడు ఆంటీ, అంకుల్ ఎంతగా ఏడ్చారో... ఈ ప్రేమ బతికున్నప్పుడు ఎందుకు చూపించరు? చచ్చిపోయింతర్వాత ఎందుకు ఏడుస్తారు? ఇష్టపడ్డ వాడితో పెళ్లి చేస్తే ఏమయ్యేది? కులం కాకపోతే పెళ్లి కుదరదా? చేసుకోకూడదా? ఎన్ని కలబోసుకొని హృదయాలు కలిశాక ఎన్ని బాసలు చేసుకున్నాక వాళ్లు ఆ నిర్ణయానికి వచ్చారో వీళ్లకు తెలుసా? ఎందుకు అలా ఆలోచించరు? శంకర్‌కు ఏం తక్కువ? అతని తల్లిదండ్రులకు ఏం తక్కువ? మధుప్రియ ఆత్మహత్య చేసుకున్నాక శంకర్ ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. కొద్దిలో మన ఇంటావంటా లేదు... పిచ్చిపిచ్చి వేషాలు వేయకు... నీకు ఉద్యోగం దొరికిన తర్వాత పెళ్లి... ప్రేమ గీమా అంటూ మళ్లీ ఒకసారి మాట్లాడకు అంటూ ఎన్ని మాట లన్నాడో... వాడి గుండె ఎంత చెదిరిపో యిందో... వాడు రాసిన ఆత్మహత్య లేఖ పోలీసులకు దొరకకుండా దాచి పెట్టారు. అది దొరికితే వాళ్లు జైల్లో వుండేవాళ్లు కాదా...

ఈ రెండేళ్లలో ఎంతమంది ఇలా చని పోయారో... అయినా తల్లిదండ్రుల హృద యాలు ఎందుకు కరగడం లేదు...

తానేమైనా అపరిచితులను ప్రేమిం చిందా... ఆమె ఏమైనా అమ్మా నాన్నలకు తెలియదా... మానస, రమ్య ఎంతో జయ అంత... జయ చిన్నప్పట్నుంచి అమ్మా నాన్నలకు తెలుసు... నాన్న స్కూల్లో పని చేస్తున్నప్పుడు ఆ పల్లెటూల్లో కిరాయికు ఇళ్లు దొరకకపోతే భాస్కర్ అంకుల్ తన ఇంట్లో ఆశ్రయం ఇచ్చాడు. ఆ ఊళ్లో వున్నంత కాలం కూరగాయలతో సహా అన్నీ ఉచితంగా ఇచ్చే వాళు , బియ్యం, నూనెలు తప్ప అన్నీ భాస్కర్ అంకుల్ ఉచితంగా మా ఇంట్లో పండినవి అంటూ ఇచ్చే వాళ్లు. సుజాత ఆంటీ ఎంత ఆత్మీ యంగా వుండేది. ఆడా, మగా తేడా లేకుండా మానస, జయ, తాను, తమ్ముడు మనోహర్ కలిసి ఎలా ఆడుకునే వాళ్లం... ఉ చితంగా నాన్న ట్యూషన్ చెప్పే వారు...

ఆ తర్వాత నాన్నకు బదిలీ అయిపోయింది. ఎన్నో ఊర్లు మారిన్రు. మళ్లీ లెక్చరర్‌గా ఈ వూరికి వచ్చింతర్వాత ఇక్కడే ఇళు కట్టిండు. తాము వున్నామని భాస్కర్ అంకుల్ తమ ఇంటి సమీపంలో కిరాయికు తీసుకు న్నాడు. అలా చిన్ననాటి స్నేహాలు మళ్లీ వికసించాయి. మళ్లీ ఎప్పటిలాగా తమకు పండింది అంటూ ధాన్యం వగైరా ఇవ్వడం వంటి మర్యాదలు రెన్యువల్ అయ్యాయి. భాస్కర్ అంకుల్ పెద్ద పార్టీ... బోలెడు వ్యవసాయం... అయినా గర్వం లేదు... నాన్నంటే అంకుల్‌కు ఎంతో గౌరవం... అయినా ఈ నాన్నలు ప్రేమలను ఎందుకు వ్యతిరేకిస్తారు...

"జయా! మనం నిజంగా పిరికి వాళ్లం... ప్రేమ కోసం మనం వీళ్లను వదులుకోవడానికి సిద్ధంగా లేం... అందరితో కలిసి హాయిగా ఉండాల్సిన మనం అందరికీ దూరమై ఒంటరిగా ఏదో తప్పు చేసినట్టు, ఎక్కడో బతకాలా... ఏమీ తోచడం లేదు... నువ్వే చెప్పు జయా..."

"మనో...! నేను ఆడపిల్లని ఇంతకన్నా ఎక్కువ చెప్పలేను. నువ్వు ఎలా చెపితే అలా... మనం ఎటైనా పారిపోదామా... ఏదైనా గుళ్లో పెళ్లి చేసుకుందామా... మన ఫ్రెండ్స్ అందుకు తప్పకుండా సహక రిస్తరు..."

"జయా! ఎక్కడికి పారిపోవడం... పారిపోయి ఎలా బతకడం..."

కళ్లు మూసుకున్న మనోజ్‌లో ఆత్మసంఘర్షణ.

లోకమంతా చీకటి. అనామకంగా ఎక్కడో కొత్తగా బతుకు ప్రారంభించడం... ఎందుకు తల్లిదండ్రులు ఇలాంటి దుస్థితికి నెట్టివేస్తారు...

"అమ్మ నగలు చాలానే వున్నయి. ఎత్తుకొస్తా... ఎటైనా పోవచ్చు..." అంది జయ.

"....." మనోజ్ మౌనంగా వుండి పోయాడు. ఎటూ తేల్చుకోలేక పోతున్నాడు. జయలో అంతర్మథనం. పారిపోదామని అందే గానీ నిజంగా అలా వెళ్లాక ఎంత కాలం నడుస్తుంది? తీవ్రమైన సంఘర్షణ... అమ్మా, నాన్నల ఒత్తిడి... మనోజ్ అయినా తల్లిదండ్రులను అడగగలడేమో గానీ తాను ఎదిరించి మాట్లాడగలదా... ఆ ఆలోచన రావడంతో భయపడి పోయింది. గుండెల్లో పిరికితనం ప్రవేశించింది...

"మనోజ్... మన ప్రేమ అమరం... జీవితమంతా మన ప్రేమను హృదయంలో పదిలంగా దాచుకుందాం... మానసతో సహా ప్రపంచంలో మూడో వ్యక్తికి మన ప్రేమను గురించి తెలియకూడదు... మనం ఇక విడిపోక తప్పదు..." అంటూ భయంగా మనోజ్ భుజాలపై చేతులు వేసి దగ్గరకు తీసుకుంది. మనోజ్ అదే స్థితిలో వున్నాడు. ఇద్దరిలో ఒకవైపు దుఃఖం... మరోవైపు ఉ ద్వేగం... ఎందుకో రమ్య తనతో తీసుకున్న ప్రమాణాన్ని తన నోటి నుంచి జయముందు పలకడం తనకే ఆశ్చర్యం అనిపించింది మనోజ్‌కు

జయ రాజీ పడబోతోంది.

తన గురించి రమ్య మనసు విరిచేసుకొని రాజీపడిపోయినట్లు తాను కూడా రాజీ పడుతున్నాడా? ధైర్యం చేయగలడా? మమ్మల్ని విడదీస్తున్నది ఏమిటి?

ఎవరి సలహా తీసుకోవడం... సలహా తీసుకుంటే విషయం బయటకు పొక్కుతుం ది... ఇంతకాలం ఇంటిపక్కన ఇళ్లు... అమ్మానాన్నలు, రెండు కుటుంబాలు కలిసి జీవించిన స్నేహాలు... ఎవరూ తమ మధ్య ప్రేమను ఊహించే అవకాశం లేదు. ఇప్పుడు ఎలా... అమ్మానాన్నలు ఏమంటారు... జయ డాడీ మమ్మీ ఏమంటారు... ఇలా ఆలోచిస్తే అది ప్రేమ అవుతుందా... బట్ట, పొట్ట, ఇల్లు, డబ్బు, కులం, ఆస్తి, అంతస్తు అనే ప్రాథమిక అవసరాల్లో స్వేచ్ఛ, ప్రేమ బందీయా... వెనకటి స్వేచ్ఛ ఈ కాలంలో లేకుండా పోయిందా... మేనక విశ్వామిత్రు డిని ఎలా ప్రేమించింది... వారికి పుట్టిన శకుంతలను దుష్యంతుడు ఎలా ప్రేమిం చాడు... ఆనాడే స్వేచ్ఛ, ప్రేమ ఎక్కువా... ప్రకృతిలో హాయి గా జీవించిన ఆనాటి జీవితంలోనే ప్రేమ, స్వేచ్ఛ, సహజ సౌంద ర్యం కొనసాగాయా... శంతనుడు గంగను ప్రేమించాడట... వారి ప్రేమ కోసం భీష్ముడు పెళ్లి చేసుకోలేదు... వశిష్టుడు అరుంధతిని ప్రేమించాడు.. రాధ కృష్ణుడిని ప్రేమిం చింది... అప్పుడు లేని కట్టుబాట్లు ఇప్పుడు ఎందుకు...

ప్రేమకు కట్టుబాట్లా.... స్వేచ్ఛకు సంకెళ్లా... ఈ సంస్కృతి, అంతరాలు సంకెళ్లా... ఎందుకోసం... ఎవరికోసం...

"జయా..."

"ఊ...."

"చెప్పు...."

"ఏం చెప్పాలి... ఏం తోచడం లేదు...నాన్న ఇళ్లు మారుద్దా మంటున్నారు... పెళ్లికి ఈ ఇల్లు చాలదు అని పెద్ద ఇల్లు తీసుకుందా మంటున్నాడు... ఇలా మళ్లీ కలుసుకోవడం వీలవుతుందో లేదో..."

మనోజ్ గుండెల్లో ఎన్నో బాంబులు పేలినంత విధ్వంసం...

"మన ప్రేమ గురించి తెలిసిపోయిందా... ఎందుకు అకస్మాత్తుగా ఇళ్లు మారుతున్నరు?"

"ఏమో తెలియదు..." జయ అంతకన్నా మాట్లాడలేకపోయింది.

తమను స్థలకాలాలు ఏకం చేశాయా? స్థలకాలాలు దూరమైతే ప్రేమ దూరమవుతుందా, దగ్గరవుతుందా... కనీసం ఇకనుండి రోజూ మొఖాలు చూసుకొనే, కళ్లతోనైనా మాట్లాడుకునే అవకాశం లేకుండా పోతుందా... ఆ ఊహే మనోజ్ భరించలేకపోయాడు.

"జయా... " బేలగా ఏడ్చినంత పని చేశాడు మనోజ్. అంతకుమించి మాట పెకలలేదు.

"ఈ కులాలు కూలిపోనీ... ఈ వ్యత్యాసాలు రాలిపోనీ... ఎందుకు పెట్టారు మనో... నాకు దుఃఖం వస్తోంది... నేను వారం రోజుల నుంచి ఎంత కుమిలిపోతున్ననో... నీకు చెప్పలేక నాలో నేను కుమిలిపోలేక ఎవరికీ చెప్పుకోలేక మనం కలిసే అవకాశం లేక... అన్నీ వున్న ఇంట్లో పుట్టినా నేను అబలను... స్వేచ్ఛ లేని బతుకులో ఎన్ని వుండి ఏం ప్రయోజనం... మనో... నేనొక బందీని... ఈ సాంప్రదాయాలకు, సంస్కృతికి, కులాలకు, కుటుంబానికి, కుటుంబ గౌరవానికి బందీని... ఇవన్నీ చెరసాలలు... వీటిని బద్దలు కొట్టడం నాతో అవుతుందా... నేను ఆడపిల్లను..."

"జయా... తరతరాలుగా ఎన్ని ప్రేమలు ఇలా శిథిలమవు తున్నాయో... మన ఎడబాటు భరించలేను... ఇద్దరం చచ్చిపోదాం జయా... మళ్లీ జన్మంటూ వుంటే కలుసుకుందాం... మన పెద్దవాళ్లకు బుద్ధి వస్తుంది... మనం చచ్చిపోయినంక అయినా మన అమర ప్రేమను, మౌన ప్రేమను గుర్తిస్తారు..."

"అలాగే మనో... నాక్కూడా అలాగే అనిపిస్తున్నది..."

చావు గురించిన ఆలోచనలు... చనిపోయిన తరువాత తమ గురించి ఎవరు ఏమనుకుంటారో అనే ఆలోచనలు... అలా ఇద్దరు ఎంతసేపు మౌనంగా వుండిపోయారో... వారి మధ్య కాలం స్తంభించింది...

"జయా... మనం చనిపోవం వల్ల ఏం ఉపయోగం... మనం ఈ సంస్కృతికి, కుటుంబాలకు, వ్యత్యాసాలకు, విలువలకు, కులాలకు బందీలై ఓడిపోయి మనకు మనమే ఉరిశిక్ష వేసుకున్నట్టు కాదా... మనం ఏం తప్పు చేశామని మనకు మనమే శిక్ష వేసుకోవడం..."

"నిజమే మనో..." జయ ఆలోచనలు స్తంభించిపోయాయి. ఏమీ తోచడం లేదు.

"చచ్చిపోయి ఏం సాధిస్తం... బతికుంటే కనీసం ఒకరి గురించి ఒకరం పరస్పరం జీవితమంతా మేలు కోరుకోవచ్చు... దూరం నుంచైనా చూసుకోవచ్చు..."

జయకు కూడా అలాగే అనిపిస్తోంది.

"ఏమో మనో... జీవితం ఎలా మలుపు తిరుగుతుందో... తెలియని కుటుంబంలో పెళ్లి... అసలే పరిచయం లేని వాళ్లతో కలిసిపోవాలె... భయంగా వుంది... తల్లిదండ్రులే పెళ్లి చేయ్యాలె... తల్లిదండ్రులు చెప్పినట్టే వినాలె... అనేది ఎవరు పెట్టిన్రో... ఎందుకు పెట్టిన్రో..." వాళ్లమీద చాలా కోపం వస్తున్నది జయకు.

"నిజంగానే లేచిపోదాం జయా..." ఉద్వేగంగా ఏదో నిశ్చయానికి వచ్చినట్టుగా అన్నాడు మనోజ్.

"ఎందుకో భయంగా వుంది... మనను పట్టుకొని చంపేస్తరేమో... అందరి ముందు అవమానిస్తరేమో... ఆ అవమానం, హింస భరించలేను మనో..."

ఏదో ఒక నిశ్చయానికి వచ్చినట్టుగా అంది జయ.

"ఇక మనం విడిపోక తప్పదు మనో..." అంటూ మనోజ్‌ను తనివితీరా ముద్దాడింది.

"మనం విడిపోవడం అసాధ్యం. మనం భయపడితే భయపెడతారు. మనం చిన్నపిల్లలం కాదు. నిన్ను విడిచి ఉండలేను. ఏమైనా కానీ..." అంటూ బిగ్గరగా కౌగిలించుకున్నాడు మనోజ్.

ఇద్దరూ లోకం మరిచారు.

'జయా!' అని పిలుస్తూ మానస అటుకేసి రావడంతో జయ, మనోజ్‌లు సర్దుకున్నారు.

> "క్షణకాలం నోటమాట రాలేదు. జయ ఎటో చూస్తున్నదల్లా మనోజ్ కళ్లల్లోకి చూసింది. ఆ చూపుతో మనోజ్ గుండె పగిలి పోయింది. ఇక వినలేను అన్నట్టు చేత్తో జయ పెదవులు మూశాడు. కళ్లల్లో ఏదో కన్నీటి పొర... తన కన్నీటి పొరతో, తన ఆవేదనతో జయ అంతకన్నా ఎక్కువ లోలోపల బాధపడుతోందని మనోజ్ గమనించలేకపోయాడు"

> "జయా! మనం నిజంగా పిరికి వాళ్లం... ప్రేమ కోసం మనం వీళ్లను వదులుకోవడానికి సిద్ధంగా లేం... అందరితో కలిసి హాయిగా ఉండాల్సిన మనం అందరికీ దూరమై ఒంటరిగా ఏదో తప్పు చేసినట్టు, ఎక్కడో బతకాలా... ఏమీ తోచడం లేదు... నువ్వే చెప్పు జయా..."

శోధన!

అన్నీ తెలుసనుకున్నా
అలవడని స్థితప్రజ్ఞత!

అశాశ్వతమని తెలిసినా
ఆత్మను తాకుతున్న మోహపు వీచిక

తొలిసంధ్య కిరణాలకై తెరచిన ఎద తలుపుల ఆహ్వానం
మలి సంజె చీకట్లకు ఎందుకో బహిష్కరణం!

ఏ క్షణమూ నిలవదని తెలిసినా
ఆపాలనుకునే అజ్ఞానం

పుటుక్కుమని తెగి పోయే బుద్బుద ప్రాయపు జీవితం
తెంచుకోలేక సతమతమయ్యే పేగుబంధం

"నిత్యం" కాదని తెలిసినా
అను నిత్యం వెంపర్లాట

మనసు,బుద్ధి, ఆత్మల పరస్పర సంఘర్షణలో
అంతిమ విజయం దేనికో!!

–లలితావర్మ
9949672671

మంచి చెడు

శ్వాస సాగితే జీవనం
శ్వాస ఆగితే మరణం.

మంచిమాటతో సాంగత్యం
చిరునవ్వుతో స్నేహానికి ఆహ్వానం
పలకరిస్తే సంబంధం
పరామర్శిస్తే అనుబంధం
ప్రశంసిస్తే నీ గొప్పదనం.

వెగటుమాటలతో పొత్తుకుదూరం
బుడ్డమూతులతో మనుషులు దూరం
విమర్శిస్తే మనసులు దూరం
కేవలం తప్పులే వెతికితే సమాజానికిదూరం
చెడు సహవాసంతో జీవనంపతనం.

ఎక్కడ మాట్లాడాలో
ఎక్కడ తగ్గాలో
ఎప్పుడు ఏ రీతిగా వ్యవహరించాలో
తెలిసిమెదలడం విజ్ఞుడి లక్షణం
నొప్పించక తానొవ్వక
పని సఫలం చేయడం కార్యసాధకుడి గుణం

జీవితమొక ప్రయాణం
ఎవరి ప్రయాణం వారిదే
ఎవరి గమ్యం వారిదే
నీ జీవితానికి నీవే డ్రైవర్
మితిమీరిన వేగంవద్దు
ఇతరుల దారికి అడ్డుపడొద్దు
పరుల విషయాల్లో జోక్యమొద్దు
నీదారి నీది
సీదాగా సాదాగా బతకడం నేర్చుకో
బ్రేకైనా ,ఎక్సేలరైనా పక్కపక్కనే వుంటాయి
ఎప్పుడు ఎలావాడాలో తెలియాలి
పొరపాటైతే అపాయమే సరిదిద్దుకోలేని అనర్థమే.

వంటింట్లో కత్తి వుంటుంది
వంకాయ కోయొచ్చు
మెడకాయ తెంపొచ్చు
వాడకం నీతోనే వుంది
ఎలావాడాలో నీ మానసికతో ముడిపడింది.

నవరంధ్రాల సమ్మేళనం జీవితం
ప్రతిరంధ్రం దుర్గంధభరితం
ఇంపైన మాటలతో
సొంపైన కీర్తనలతో
వినసొంపైన ప్రశంసలు కురిపించేది
కేవలం మనిషి నోరొక్కటే ....
అప్పుడే జీవితంలో సుగంధం పరిమళిస్తుంది
జీవన పరమార్థం బోధపడుతుంది
అందుకే,
మంచి మాట్లాడుదాం
మంచి విందాం
మంచి చూద్దాం
మంచే చేద్దాం. –రామడుగు వేణుగోపాల్
97455930441

తలుపులు తెరుద్దాం..!

వంశవృక్షము చిగురించి
పచ్చని జీవన విధానమై పరిమళించి
మధురమైన అనుభూతులై
మరుపురాని సంఘటనలై
మదినదిలో మొగ్గ తొడిగాయి..!

పెద్ద కుటుంబ వనంలో
విరబూసిన పుష్పాలు
సామాజిక విలువలను పాటిస్తూ
సమాజ సంక్షేమానికి
ఊతకర్రలై ముందుకు సాగుతాయి..!

అస్తవ్యస్తమైన కుటుంబ తోటను
మానవత్వమనే నాగలితో దున్ని
ఆత్మీయతనే ఎరువుతో చదును చేసి
విలువల విత్తులు నాటితే
మమతానురాగాలనే పంట విరబూస్తోంది..!

తల నెరిసిన సమయంలో
ఆత్మీయ పరిమళాలు
హృదయాంతరాలను మీటాలంటే
కుటుంబ వృక్షమును కాపాడే
ఉమ్మడి వ్యవస్థ తలుపులు తెరవాల్సిందే..!

–పిల్లి.హజరత్తయ్య,
9848606573

ఆహ్వానం
కిన్నెర ఆర్ట్ థియేటర్స్
శ్రీ త్యాగరాయగానసభ- ద్వానా సాహితీ కుటీరం
సాహిత్య సవ్యసాచి, విమర్శనకళాప్రవీణ
డా॥ ద్వానా శాస్త్రి 75వ జయంతి సందర్భంగా
ప్రముఖ రచయిత్రి
డా॥ సి. భవానీదేవి గారికి
ద్వాదశి లక్ష్మి ప్రసన్న స్మారక పురస్కారం
నేటి నిజం సంపాదకులు
శ్రీ బైస దేవదాసు గారికి
ద్వానా శాస్త్రి స్మారక పురస్కారం బహూకరణ
బుధవారం 15, జూన్ 2022 సా॥ 6 గంటలకు
కళా సుబ్బారావు కళావేదిక, శ్రీ త్యాగరాయగానసభ,
చిక్కడపల్లి, హైదరాబాద్
ముఖ్యఅతిథి :
డా॥ కె.వి. రమణ, ఐఎఎస్ (ర)
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు
సభాధ్యక్షులు :
డా॥ వోలేటి పార్వతీశం
ప్రముఖ సాహితీ వేత్త
విశిష్ట అతిథి :
శ్రీ కళా జనార్దనమూర్తి
అధ్యక్షులు, శ్రీ త్యాగరాయగానసభ
ఆత్మీయ అతిథి :
శ్రీ ద్వాదశి శశికాంత్ (ద్వానా శాస్త్రి కుమారుడు)
డా॥ ఆర్. ప్రభాకరరావు, I.P.S. (Retd.) అధ్యక్షులు, కిన్నెర
మద్దాళి రఘురామ్ కార్యదర్శి, కిన్నెర
కళాతారర కార్యదర్శి, శ్రీ త్యాగరాయగానసభ

ఉద్యానవనాలు

రంగు రంగు పువ్వులతో
రమణీయంగుండును..
తీరొక్క చెట్లతో..
కనుల విందుగుండును..
వారెవ్వా ఉద్యానవనాలు..
ఉత్సాహోన్నిచ్చును జనులకు..

ప్రశాంతత కోసం జనులు..
నీ చెంతకు చేరును..
మనసు కుదుట పడినాక..
ఇంటి ముఖము పట్టును..
ఏమాయనున్నదో నీ చెంత..
కాని తీరును జనుల చింత..

ముచ్చటైన పిల్లలను..
ముద్దుగ ఆడిస్తావు..
సేదతీరుటకచ్చెటి...
వృద్ధులకు నీడైతవు..
కల్మషం లేకున్నవు..
కాపలా కాస్తుంటవు...

గూడు లేనోల్లకు..
నీడనిచ్చి తోడైతవు
కన్నతల్లి వోలె..
కడుపున దాచుకుంటవు..
మీ ప్రేమలు ఎనలేనివి..
మిమ్ము మరువబోరు శరణార్థులు..

–పసుల.శంకర్
9542181301

కళ్లు మూస్తే శ్రీ శ్రీ
కళ్లు తెరిస్తే శ్రీ శ్రీ
కళ్లు మూసినా తెరిచినా
శ్రీ శ్రీ

అభ్యుదయ కవుల
కలాల్లో గళాల్లో
జ్వలిస్తున్న శ్రీ శ్రీ

–వి.సూర్యారావు
92469 11234

మరణ మర్మం..!

పంచభూతాల సమ్మేళిత దేహం
కాలమనే చక్రం మీద మట్టితో..
దైవం నగిషీలు పెట్టిన తాత్కాలిక..
మట్టికుండే కదా మనిషి జన్మ !

జీవితం ఓ ఉత్సవంలా సాగాలని....
ప్రయాణపు తుది అంకమే మరణమని..
ఆహ్వానించి ఆలింగనం చేసుకుందాం
మరణించే కళను నేర్చుకుందాం !

అనాయాస మరణమే అదృష్టమని..
'నేను–నాది' అనేది ఏదీ నిది కాదని..
జననం సాధారణమైందే అయినా..
చావు చరిత్ర సృష్టించేదిగా ఉండాలని !
మృత్యువు అత్యున్నత సత్యమని..
మరణం గూర్చి నిందుగా మాట్లాడాలని..
పీల్చిన గాలి, తాగే నీరు, నివాస నేలకి..
మనిషి రుణపడి ఉండాలి సర్వదా !

పైకి విసిరిన రాయి ధైర్యంగా ఎగిరినా..
తుదకు భయంతో కింద పడాల్సిందే అని..
బయట పడలేని చావును తలచి..
అవగాహన పెంపొందడమే జీవితం !

'తనువు' మూన్నాళ్ల ముచ్చటని..
'అరువు'గా వచ్చాం ధరణిపైకని..
'ఎరువు'గా మారతాం కొన్నాళ్లకని..
'పరువు'గా జీవితాంతం బతకాలని
మరణ మర్మమెరిగి మసలుకుందాం !

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

గజల్

కలం కదిలితే కమనీయ కవిత.. చిలికించిన సినారె
గళం పలికితే తీయ తేనియత..కురిపించిన సినారె

కావ్యసుమా లల్లినాడు..మానవతా పరిమళం పంచినాడు
కవిత పదములకు లయాత్మకత..నేర్పించిన సినారె

ఋతుచక్రం సుమధుర కావ్యం..గెలిచింది రాష్ట్ర పురస్కారం
ఆరు ఋతువుల గమనాన్ని వర్ణించి..అలరించిన సినారె

మంటలూ మానవుడు కావ్యం..అందుకుంది కేంద్ర పురస్కారం
సగటు మానవుని జీవితగమనాన్ని.. చిత్రించిన సినారె

విశ్వంభరా కావ్యం సృష్టించి..జ్ఞానపీఠాన్ని అధిష్ఠించినాడు
తెలుగు వచనకవితకు ఘనకీర్తిని.. అందించిన సినారె

తెలుగుభాషకు ప్రపంచపదులను..మానవీయ గజళ్ళలను
అందించి గానం చేసినాడు.. మురిపించిన సినారె
సినీగీతాలు రచించినాడు..హృదయాలను దోచుకున్నాడు
ఇగిరిపోని గంధమంటి పాటలను..సృష్టించిన సినారె

– బూర దేవానందం
8143589789

అమ్మ మాటలు

తన పేగును కోసి
రక్తపు మరకలతో వున్న పసిబిడ్డను
సంతోషంగా ముద్దాడుతూ
తన రొమ్ము పాలను ఎలా తాగాలో
చిన్న చిన్నగా నేర్పుతోంది –
తీయటి నొప్పిని భరిస్తూ ...

తప్పటడుగులు వేస్తున్న
పసిబిడ్డను దీర్ఘంగా చూస్తూ...
కింద పడతాడన్న ప్రాణ భయంతో
నిరంతరం రక్షణ వలయంలా
బిడ్డ చుట్టూ పదేపదే తిరుగుతూనే
మాటల్లో చెప్పలేని శక్తినంతా ధారపోసి
ప్రతిక్షణం కాపాడే ప్రయత్నాలు ఎన్నెన్నో

ఎదిగేకొద్దీ కంటికి రెప్పలా గమనిస్తూ
పెద్దయ్యాక
ఎక్కడ తప్పుటడుగులు వేస్తాడనే భయం

ప్రతిరోజూ తన విలువైన మాటలతో
రక్షణ కవచంగా బలంగా కడుతోంది అమ్మ

పసిప్రాయం మొదలుకొని
పండు ముసలి రూపం వచ్చేవరకు
అమ్మ మాటలు ఎప్పుడూ వెంటాడుతూ
మంచి చేయమని పదేపదే చెబుతూ
నిండు నూరేళ్లు వర్ధిల్లాలని
దీవిస్తోంది అమ్మ

–దాసరి సుబ్రహ్మణ్యేశ్వరరావు
సెల్ : 9493033534

ఆర్థిక బంధాలు నిలబడేనా..?

డబ్బు మాయలో పడి
మానవులు మరుస్తున్నరు
బంధువులను.. బంధుత్వాలను
జబ్బునేడి ఆర్థిక ఊబిలో చిక్కి
విలువలను వెలేస్తున్నరు..!
ఒంటరిగా మిగులుతున్నరు..!!

అక్క చెల్లెళ్ల బంధాన్ని
రొక్కముతోడ లెక్కిస్తున్నరు
అన్నదమ్ముల అనుబంధాన్ని
పైకముతో ముడిపెడుతున్నరు
యాడ కానరాదు బంధము..!
ఎవ్వడు నిలుపకున్నడు బంధుత్వము..!!

అమ్మానాన్నలకు సేవచేయకుండ
ఆశ్రమాలకు పంపుతున్నరు
అక్కున చేర్చుకోకుండ
ఆకలితో చంపుతున్నరు
యాడ ఉన్నవి బంధాలు..!
కానరాకున్నవి సంబంధాలు .!!

రొక్కముతో కలిసే బంధాలు
స్థిరమని తెలియకున్నరు
అవే శాశ్వతము అనేటి
భ్రమలో కులుకుతున్నరు
ఆపద వచ్చినపుడు
ఆదుకోనికి రారని ఎరుగకున్నరు
తోబుట్టవులు,రక్త సంబంధికులు
స్నేహాన్ని పంచువారు
ముందు వరుసలో ఉంటారనే
మాట నిజమని మరుస్తున్నరు
తెలుసుకోకున్నడు నరుడు..!
మత్తును వీడకున్నడు మానవుడు..!!

తాత్కాలిక బంధాలకు
సాహసం చేస్తున్నరు
శాశ్వత సత్సంబంధాలను
వీడుటకు శుభం పలుకుతున్నరు
కాలరాస్తున్నరు బంధాలను..!
కనిపించకుండ చేస్తున్నరు మనుషులను..!!

మానవా... ఓరోరి మానవా
మార్పు వచ్చేది ఎప్పుడు
మలినం తొలగేదెప్పుడు
మైకం వీడేదెప్పుడు
మనిషిలా బతికేదెప్పుడు
బంధానికి విలువిచ్చేదెపుడు
సత్సంబంధాలు నిలుపుకునెదెప్పుడు
ఆర్థిక బంధాలను తులనాడి
అన్నదమ్ములు,అక్కచెల్లెళ్ళ
అమ్మానాన్నల,ఆత్మీయుల చెంత చేరి
పంచుకో బాధలను..!
నిలబెట్టుకో బంధాలను..!!
ఎంచుకో మంచి మార్గమును..!!!
తుంచుకో నీలోని మలినమును..!!!!

-పసుల.శంకర్
542181301

"ఘోరకలి" కాలం

కలికాలాన్ని మించిన
"ఘోరకలి"కాలమిది..

కర్షకజీవులు
అర్రాకలితో అలమటిస్తాయి..
కుబేరజాతులు అర్ధనగ్ననృత్యాలతో
పేట్రేగుతాయి..

అర్థంపర్థం లేని వితండ వ్యవస్థలో
అర్థంకాని ప్రశ్నలెన్నో
శిథిలాల్లా మిగులుతాయి..

కలికాలాన్నిమించిన
"ఘోరకలి"కాలమిది

అసురముఖాలు
పాషాణహస్తాలు చాచి
దేశసంపదను కబళిస్తాయి.

విషపురుగులు
మనిషివేషంలో
క్షుద్రతాండవం చేస్తాయి..

నరపశువులు పసిమొగ్గలపై
తుచ్ఛకృత్యాలు చేస్తాయి..

కలికాలాన్నిమించిన
"ఘోరకలి"కాలమిది

-సుందర తేజశ్విని
8309514802

ధరల మంట

ధరల మంట
ఒక పక్క ఉక్క పోత
మరోప్రక్క వడదెబ్బ
దాని పై ధరల దెబ్బ
పేద మధ్యతరగతి కుదేలు
గ్యాస్ గుదిబండ అయే
కడుపులోని గ్యాస్ మంటను
తలదన్నే
పాలు పెరుగు రేట్లు పల్స్ రేట్లు
పెంచి బి.పి కి తంటా
కూరగాయలు కుదేలు చెయ్య వట్టే
పెట్రోలు తోలు తియ్య వట్టే
అన్ని ధరలను ట్రోల్ చెయ్య వట్టే
ధరలు ఆకాశం లోని చుక్కలై
ఆదాయం ఐస్ ల ఆవిరి
కా వట్టే
రాజకీయ నాయకులు
విమర్శలు ప్రతివిమర్శలే తప్ప
ధరలకు కళ్లెం వేయుటలో వెనుకంజ
రూపాయి విలువ పతనం
ద్రవ్యోల్బణం సామాన్యుడికి
ఏమి ఎరుక
అంకెల గారడీలు చూపి
ప్రభుత్వాలేమో తప్పదు
అని జవాబు చెప్పవట్టే
ధరల తో
తంటాలు తలనొప్పులుఆ
ఇంటిట ఇదే కథకమిషు

-ఉమశేషారావు వైద్య
9440408080

జీవిత సత్యాల సమాహారం డా. ఏనుగు నరసింహారెడ్డి గారి

" తెలంగాణ రుబాయిలు"

"అడిగి అడిగి పాడిస్తీనే పాడు.
కోరి కోరి పాడిస్తీనే పాడు.
కళకు విలువ లేని చోట నిలువకు.

ఇంకా కావాలి అన్నప్పుడే పాడు ' ఈ మాటలు రాయడానికి , అనడానికి గొప్ప తాత్విక శక్తి కావాలి. బతుకు ఉట్టి భజన పరుల్లా బతుకడం కాదు, అవకాశాల కోసం అడ్డదారులు తొక్కడం కాదు, అల్పుల దరి చేరి అందలాలు ఎక్కడం కాదు, నిజాయితీగా బతుకాలి , ఎక్కడ తన అవసరం ఉంటే అక్కడ సత్యంగా ధర్మంగా ఆ పనిచేస్తూ పోవాలి మనిషి. నిజంగానే కళకు విలువ లేని చోట కళాకారుడు అక్కడ ఉండకూడదు కదా ! ఇది ప్రసిద్ధ కవి ఏనుగు నరసింహారెడ్డి గారి రుబాయిల్లో ఒకటి.

''ఏదంటే అదయ్యిద్ది పాబందుంటే
ఎప్పుడంటే అపుడయ్యిద్ది పాబందుంటే
మాట మీద నిలువడం చాలా కష్టం
ఆత్మ బలం వృద్ధెద్ది పాబందుంటే"

' పాబంది అనేది తెలంగాణ జానపదాలలో ఒక గొప్ప మాట. పాబంది అంటే క్రారంశిఅస్రం బందిగా ఉంటే బతుకులో ఏదయినా సాధించవచ్చు , అలా ఉండడం కష్టమే కానీ పాబందిగా ఉంటే అన్నీ సాధించుకుంటు ఆత్మ స్థైర్యంతో బతుకవచ్చు అంటారు వారు ఇంకో రుబాయిలో 'ఎంతో ప్రయత్నిస్తేనే కొన్ని జరుగుతై ఏమి లేకుండా కూడా కొన్ని జరుగుతై కాలం లోనే తెలియ లేని ఒక క్రమ ముంటుంది కలిసస్తే జీవితంలో అన్నీ జరుగుతై ' జీవిత అనుభవంతో చెప్పిన మాట ఇది . ఏది జరిగినా ఏమి జరిగినా జీవితంలో ఒక ఆక్సిడెంట్ లా జరుగుతుంది. కాలానికి తెలుసు మనిషిని ఎలా ఉంచాలో. నిజంగానే కాలం కలిసస్తే వాటి అంతట అవే పనులు జరిగి పోతుంటాయి. అనుభవం లోకి వచ్చిన వాళ్ళు చెపుతారు ఈ విషయాలను. 'ఒకసారి మిత్రుడి రూపంలో వస్తది ఒక పరి సంఘటన రూపంలో వస్తది నసీబ్ నడిచి రావాలనుకుంటే చాలు ఒకే ఒక్క అక్షరం తేడాతో వస్తది ' ఇది కూడా కవి అనుభవంతో చెప్పిన మాటనే . వచ్చే అదృష్టాన్ని ఎవరు ఆపుతారు నిజంగా, అది వివిధ సందర్భాల్లో వివిధ రూపాల్లో వస్తది మనిషి జీవితంలో ! నసీబ్ ఉర్దూ పదం అయినప్పటికీ తెలంగాణ జన సామాన్యానికి పరిచితమైన మాట. నసీబ్ ల రాసిపెట్టి ఉంటే నడిచచ్చే కొడుకు పుడుతాడు అనే సామెత కూడా ఉంది. ' నిజమొకటి మాట్లాడు నీతులు అక్కర లేదు చిన్న సాయం చేయి ఖ్యాతులు అక్కర లేదు సంతృప్తి యన్న దొకటే స్వర్గలోక నఖలు సహజ వర్తనమే మేలు ఘణతలు అక్కర లేదు, ఎంత చక్కటి మాటలు ఇవి. నీతి బోధనలు, జ్ఞాన బోధనలు! చాలవా బతుక్కి ఇవి ! నీతిగా బతుకడం, పరోపకారిలా బతుకడం! సహజ వర్ణనం తో ఆత్మ తృప్తితో మన పనులు మనం చేస్తూ బతుకడంలో ఎంత తృప్తి ఉంటుంది. సాహిత్య సృజన అంటే మనల్ని మనం మంచిగా బేరజ్ వేసుకొని బతుకడమే ! ఈ విషయాలను గుర్తు చేస్తున్నాడు నరసింహారెడ్డి గారు స్వత సిద్ధమైన తన నైజంతో. ' అంతటా నోరు దాచుకోకు అంతటా మనసు దాచుకోకు ఎరుగని చోట వాక్కే శక్తి స్వశక్తి నెవ్వుడూ దాచుకోకు' సాహిత్యం సందేశాన్ని ఇస్తుంది, మన కర్తవ్యాన్ని గుర్తుకు చేస్తుంది. మాట్లాడవలసిన సందర్భంలో తప్పకుండా మాట్లాడాలి మన శక్తిని తెయ చేస్తూ. ఈ విషయంగా నాకు ' కవీ ! ఎవరు గుర్తిస్తారు నిన్ను ఈ దేశంలో నువ్వు గొంతెత్తుకుంటే తప్పా ! ' అనే మాట జ్ఞాపకం వస్తుంది. ఇలా నరసింహారెడ్డి గారు మన కర్తవ్యాన్ని గుర్తు చేస్తున్నారు. మరింకో రుబాయిలో నరసింహారెడ్డి గారు, లోకం నైజాన్ని ఇలా తెలియ చేస్తున్నారు. ' చిత్తశుద్ధిని పలుచన చేస్తరు నిత్య కర్మను చులకన చేస్తరు పని చెయనోల్లే చక్రం తిప్పి కఠిన శ్రమలను విలవిల చేస్తరు' నిజంగా ఈ లోకంలో హిపొక్రాట్లదే రాజ్యం కదా చిత్తశుద్ధితో పని చేసిన వాళ్ళను పక్కన పెట్టి పని చేయని వాళ్ళే చక్రం తిప్పుతారు కదా ! అయినా విజ్ఞుడు ఎప్పుడూ తన పని తాను చేసుకుంటూ వెళ్ళాడు వెరువకుండా ! లోకం నైజాన్ని గమనించి ఈ రుబాయిని పండించారు నరసింహారెడ్డి గారు. మరింకో రుబాయిలో కన్నీటి సముద్ర మంతటి భావాన్ని మన కండ్ల ముందు ఉంచారు వారు. కాలే కడుపుతో అలిసినప్పటి రోజులు ఖాళీ జేబులతో తిరిగినప్పటి రోజులు చెప్పిన పాఠాలు ఏ గురువు చెప్పలేడు ! దిక్కు తోచని పక్షులైనప్పటి రోజులు' కష్టాల కడలిని ఈదిన వారు మాత్రమే చెప్పగలరు ఈ భావాన్ని. కష్ట సుఖాలను మేళవించుకొని బతుకును దర్శించిన మహానుభావుడు నరసింహారెడ్డి గారు. ఇలా వారు బతుకును నెమరేసుకుంటున్నారు రుబాయిల్లో . నరసింహారెడ్డి గారి రుబాయిల్లో తెలంగాణాతనం ఉంది, తెలంగాణా భాష ఉంది. తెలంగాణ జన సామాన్యం వాడుకునే చాలా పదాలు ఉన్నాయి. చాలా తేలికైన, సులభ గ్రాహ్యమైన , పొందికైన పదాలను వారు వాడుకున్నారు ఈ రుబాయిల్లో . వారు ఈ రుబాయిలు రాసే నాటికి తెలంగాణా రాష్ట్రం కోరి ఉద్యమం నడుస్తుంది. వారు తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఆవశ్యకత కోరి కూడా రుబాయిలు రచించారు. ఎవరికి ఇష్టం ఉన్నా లేకున్నా తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు అనేది ఒక చారిత్రక సత్యం. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కోరి రచనలు చేసిన కవులు వందలాది, వేలాది మంది కవులు ఉన్నారు తెలంగాణలో. ఆ త్రోవలో నరసింహారెడ్డి గారు కూడా . వారు ఈ రుబాయిలకు తెలంగాణ రుబాయిలు ' అనే పేరు పెట్టింది ఇందుకోసమేమో ! ఎవరో నొచ్చుకుంటారు అనో కవి కవితలు రాయకుండా ఉండడు, కొందరి మెప్పు కోసమని మాత్రమే కావాలని నిజమైన కవి రాయడు. ఒక సత్యాన్ని ఆవిష్కరింప చేయడమే కవిత్వ పరమ ప్రయోజనం. అందుకే నరసింహారెడ్డి గారు ఒక రుబాయిలో ఇలా అంటారు. ' అప్పుడెప్పుడో అన్నానని మనసులోన పెట్టుకోకు ఏదేదో విని ఉంటవ్ మది లోపల పెట్టుకోకు చెప్పినవన్నీ

క్షమించేటి రోజొకటి రానున్నది రాలే పూలమే మనం మనసు కష్ట పెట్టుకోకు' జీవితం ఒక సమ దర్శనం కవికి మంచిని కాంక్షిస్తూ. నరసింహారెడ్డి గారు కవిత్వంతో , మనతో కూడా స్నేహ హస్తం కోరి కరచాలనం చేస్తున్నారు. నరసింహారెడ్డి గారి రుబాయిలు జన ప్రసిద్ధ మైనాయి. మొదట 2013 వ సంవత్సరంలో మొదట ' నేటి నిజం' దిన పత్రికలో, తర్వాత oneindia.com లోనూ తర్వాత ' ఆంధ్రప్రభ సాహిత్య పేజీల్లో 2017 నుండి 2019 వరకు మూడు సంవత్సరాలు సీరియల్ గా వచ్చి పాఠకుల ఆదరణ పొందినాయి . కాల క్రమంలో దక్షిణా మూర్తి, పద్మావతి, లెనినా లాంటి గాయకులచే మధురంగా గానం చేయబడి యూ ట్యూబ్ లో వీక్షకులకు దర్శనం ఇస్తున్నాయి. రుబాయిలు రాసి మెప్పించడం అంత ఆశామాషి వ్యవహారం కాదు. కానీ అందులో నఫలీకృతులయ్యారు ఏనుగు నరసింహా రెడ్డి గారు. పదకొండవ శతాబ్దంలో పారసీ కవి ఉమర్ ఖయ్యాం చే రచించబడి పారసీ లోనూ,. ఉర్దూ లోనూ బహుళ జనాదరణ పొందినాయి. ఉమర్ ఖయ్యాం రుబాయిలు ఎడ్వర్డ్ ఫిట్జ్ గెరాల్డ్ చే ఆంగ్లంలోకి అనువదించబడి 1859లో పుస్తక రూపంలో వచ్చి విశ్వ విఖ్యాతి గాంచినాయి. తెలుగులోనూ ఉమర్ ఖయ్యాం రుబాయిలు దువ్వూరి రామిరెడ్డి గారిచే ' 'పానశాల' పేరున పద్య రూపంలో అనువదించ బడినాయి. ముద్దుకృ ష్ణ కూడా ఉమర్ ఖయ్యాం రుబాయిలను పద్య రూపంలో అనువదించి నాడు. మహా రచయిత చలం ఉమర్ ఖయ్యాం రుబాయిలను వచన రూపంలో అనువదించినాడు. రుబాయికీ ఒక ప్రత్యేకమైన నిర్మాణ రూపం ఉంది. తెలుగులో డా. దాశరథి కృష్ణమాచార్యులు, డా.తిరుమల శ్రీనివాసాచార్యులు తర్వాత అత్యధికంగా రుబాయిలు రాసిన వారు డా. నరసింహారెడ్డి గారే. అలా ఇటీవలి కాలంలో రుబాయిలకు విశేష ప్రాచుర్యం కల్పించిన వారు నరసింహారెడ్డి గారే. ఈ ' తెలంగాణ రుబాయిలు ' కావ్యంలో 536 రుబాయిలు ఉన్నాయి. అందులో కొన్ని ముత్యాలు, కొన్ని రతనాలు, కొన్ని వజ్రాలు, కొన్ని వైడూర్యాలు, కొన్ని మరకతాలు, కొన్ని మాణిక్యాలు. ఏకంగా 300 పేజీల పుస్తకం అది. కొన్ని రుబాయిలను చదువుతుంటే మనల్ని మనం చూసుకోవచ్చు, చదువుకోవచ్చు ఆ రుబాయిల్లో. నరసింహారెడ్డి గారు మంచి వచన కవి, పద్యకవి, వ్యాసకర్త, అనువాదకులు కూడా . ఆ క్రమంలో తెలుగు సాహిత్యానికి ' తెలంగాణ రుబాయిలు' అనే మంచి పుస్తకాన్ని అందించిన డా. ఏనుగు నరసింహారెడ్డి గారు అభినందనీయులు.

> "ఎవరో నొచ్చుకుంటారు అనో కవి కవితలు రాయకుండా ఉండడు, కొందరి మెప్పు కోసమని మాత్రమే కావాలని నిజమైన కవి రాయడు. ఒక సత్యాన్ని ఆవిష్కరింప చేయడమే కవిత్వ పరమ ప్రయోజనం"



ప్రతులకు:
తెలుగు భాషా చైతన్య సమితి
2-3-64/ఎ/74,
ప్రేమ్‌నగర్ కాలనీ. అంబర్‌పేట్,
హైదరాబాద్-13
సెల్: 9160607662

-డా. సబ్బని లక్ష్మీనారాయణ.
8985251271

వంశ వృక్షం

వంశవృక్షంవటవృక్షంలానాటుకోవాలంటే
కుటుంబవ్యక్తులమధ్యబంధాలు,
అనుబంధాలు,ఆత్మీయతలు
ఆప్యాయతలుతొణికిసలాడాలి,
ప్రేమానురాగాలు తారాడాలి,
కష్టసుఖాల్లోపాలుపంచుకోవాలి,
మనసెరిగి మసలుకోవాలి,
నమ్మకమనే పూ తోటలో పయనించాలి,
రక్తసంబంధీకుల మధ్య
మానవత్వపు పరిమళాలు విరజిమ్మాలి,
స్వార్థాన్ని విడనాడాలి,
మంచి,మానవత్వపుబాటలో
పయనించాలి,
ఒకరికొకరుచేయూతనందించుకొని
వంశవృక్షాన్నికాపాడుకోవాలి
పెద్దలను పూజించు,
నీకుజన్మనిచ్చినతల్లిదండ్రులను
కంటికి రెప్పలా కాపాడుకొని
కుటుంబ వన్నె గౌరవాలను
నవతరానికి అందించు,
వృక్షో రక్షతి రక్షితః"

-రాయవరపు సరస్వతి
7989665525

పీల శాల్తీ

ఒక్కోసారి
గుచ్చాలనిపిస్తుంది
నొప్పించి
కనువిప్పించాలనిపిస్తుంది
అధికార మదానికీ
అర్థ రహిత ఆవేశానికీ
అక్షర వడగళ్ళతో
బుర్ర గిర్రుమనిపించాలనీ
పదాల శరాలతో
పురుష పుంగవునికి
పరుషంగా సలపరించాలనీ
మాట అదుపులో పెట్టుకుని
పొదుపుగా వాడుకునేలా
ఓ కొరడా ఝుళిపించాలనీ
తప్పక చెప్పాలనిపించినప్పుడు
నా దగ్గరున్న
శక్తిమంత ఆయుధం
ప్రయోజనాత్మకంగా ప్రయోగిస్తాను
అది ఒక సామూహిక గొంతుగా
రూపాంతరం చెంది
అహంకారాన్ని నియంత్రిస్తుంది
బలవంతమైన
పీల శాల్తీ
నా కలం !

-గుండాన జోగారావు
6302718715

రుబ్బురోలు

రుబ్బురోలు పెరటిలో నున్న, నెల్ల రిల్లాండ్రు సంతసింతు రనుట నిజము;
పప్పు రుబ్బుకొనుట, పచ్చళ్లు చేయుట
దాన నౌను సులభ తరము గాన!

భార్య పప్పు రుబ్బు 'భంగిమ' తిలకించి
సరసు డైన భర్త మురియకున్నె?
సహకరించుటకును సన్నద్ధమౌ రసి
కావతంసు లుందు రందునందు!

ప్రతిదినమ్మునను ఉపాహార రుచుల కో
రుకొను వారి యింట రుబ్బురోలు
తప్పకుండ నుండదగు, నది లేకున్న,
నెట్టు లమరు నట్టు, లిడ్డెనలును

రుబ్బురోలు లేక యిబ్బందిపడు గృహి
ణులును కొంతమంది గలరు; తరచు
పప్పుగిన్నె చేతబట్టి, పరుల కొంప
లకును పోవుటనిన లజ్జ కాదె

అరిగిపోయెనేని, మరల కక్కులను కొ
ట్టించి వాడుకొనుట కాంచనౌను;
ఒక్కసారి కొన్న, నుండు చిరంజీవి
వోలె రాతి రుబ్బురోలు కాద

కాలగమనమందు కలిగె మార్పులు చాల,
వచ్చుచుండె యంత్రపరికరములు;
వంటయింట విప్లవము దెచ్చె 'వెట్ గ్రైండ'
రొకటి, 'మిక్స్' రనున దొకటి వచ్చి!

పప్పు రుబ్బుకొనుట, పచ్చళ్లు చేయుట
వంటి వంటయింటి పనులు సులభ
తరము లయ్యె కొత్త పరికరముల వల్ల,
కాన, మోజు పెరిగె వాని పైన!

కొత్త పరికరాలు కొనలేనివా రిళ్ల
లోనె వాడ్క నుండె రుబ్బురోళ్లు;
కాన, వాని యునికి కాలక్రమమ్మున
తగ్గి, మృగ్యమగుట తప్ప దింక!

కుదురదేని రుబ్బుకొనుట, గృహమ్ముల
లేకయున్న 'మరలు', లేదు చింత;
వీథి వీథిలోన వెలసియుండెను నేడు
డబ్బు గొనుచు పిండి రుబ్బు మరలు!

'పానవట్ట' మటుల గాననౌ నొక కొన్ని
రుబ్బురోళ్లు! 'లింగ' రూపములనె
పోలియుండు నెల్ల పొత్రము! లిందోదొ
అంతరార్థ మున్న యట్లు దోచు!
(పానవట్టము=లింగపీఠము)

-హెచ్. ఆర్. చంద్రం
9493248053

మాతృభాష మెరుపులు

మాతృభాష అంటే
మమత లొలుకు
పరభాష అంటే
మది పణుకు !

అమ్మ భాషకు
మనమంటే ఆదరణ
పరాయి భాషకు
మనమంటే నిరాధారణ !

తెలుగు పాటలెప్పుడూ
కోకిల గానాలే
ఆంగ్ల పాటలెప్పుడూ
గార్దభ గానాలే !

తెలుగు దివిటీలు
సంప్రదాయాన్ని వెలిగించును
పరభాషా దీపాలు
సంస్కృతిని కాల్చేయును !

తెలుగు పలకరింపులో
మది పులకించేను
ఆంగ్ల పలకరింపులో
రోత పుట్టించేను !

-రవి చంచల
8500330700

పుస్తక సమీక్షలు

ఆధ్యాత్మిక అమృతవాహిని రఘుశ్రీ రెక్కలు

కవిత్వం అంటేనే నిరంతర సాధన. వ్యక్తీకరణ శిల్పం విషయాలు చక్కగా పాటిస్తూ రాసే కవిత చాలా కాలం నిలబడుతుంది. వచన కవిత్వం తరువాత సాహితీ ప్రక్రియ ల్లో మినీ కవిత్వం ప్రముఖ స్థానం లో ఉంది.

ఎన్నో మినీ కవితా ప్రక్రియలు ఆవిర్భవించి వర్ధిల్లుతున్నాయి.అలాంటి ప్రక్రియల కు సాహిత్యకారులు వారి వారి సృజన ను జోడించి అందమైన కవితగా రూపొందిస్తారు.

అలా కొన్ని నియమాలను ఏర్పరచి పాటిస్తూ రాసే ఆరుపాదాల ప్రక్రియ రెక్కలు.

మొదట నాలుగు పాదాలు రాసి కొంచెం దూరంగా కాస్తా ప్రక్కగా మిగతా రెండుపాదాల్ని రాస్తుంటారు. ఈ రెండు పాదాలు పాఠకుని ఊహకు పదునుపెట్టేదిగా వుంటుంది. రెక్కలు కవిత రెండు భాగాలుగా ఉంటుందన్నమాట! పై నాలుగు పాదాలు పక్షి శరీరంగాను, మిగతా రెండు పాదాలు పక్షి రెక్కలుగాను భావిస్తారు అందుకే ఈ ప్రక్రియ కు 'రెక్కలు' అనే పేరుపెట్టారనుకోవచ్చు. ఈ చివరి రెండు పంక్తులు రెక్కలై ఎగరనిదే సందేశం పూర్తికాదు.



ప్రముఖ కవి రఘుశ్రీ రాసిన" కవీంద్రమోక్షం" రెక్కలు ప్రక్రియ లోని కవిత్వం అలాంటిదే అని చెప్పుకోవచ్చు. కవి తన అనుభవాలన్నీ చక్కగా వ్యక్తం చేస్తూ పాఠకులకు అనుభూతమయ్యేటట్లు చేసాడు. దాదాపుగా 260 పైచిలుకు కవితలు "కవీంద్ర మోక్షం "రెక్కలు కట్టుకున్నాయి.

సుగమ్
" బాబు
అంటించిన రెక్కలు
కవికోకిల లై
ఎగిసే విశ్వ రాగాలు ?..
(కలం) రెక్కాడేది.
షట్పాదార్చనతోనే.

సుగమ్ బాబు ప్రవేశ పెట్టిన రెక్కలు లఘు కవితా ప్రక్రియ రెక్కలు తొడిగి ఎగురుతున్నాయి.

రెక్కలను రాయాలంటే కలం రెక్కలు ఆడిస్తే ఆరు పాదాల రెక్కలు మొలుస్తాయని చమత్కార యుక్తంగా చెప్పాడు కవి.

ముల్లుచేసేగాయం
పైకి కనిపిస్తుంది
గుల్ల చేసే కపటం
లోన నులివేస్తుంది
రెండింటికీ
కన్నీళ్లే .

శరీరాని కి గాయం అయితే బయటకు కనిపిస్తుంది కానీ మనసుకు అయిన గాయం కనిపించదు లోలోపలే మనసును మెలిపెడుతుంది.

యమ?..నచికేతుల
సంవాదంలా
మాటలు మణులై
ఆత్మ తత్వం
చాటాలి)మాటలు
చెకుముకి రాళ్లు.

(తండ్రి మాటలు నిజం చేయాలని సజీవ దేహంతో యమలోకానికి వెళ్లి యముడితో తనకు ఆత్మ తత్వాన్ని బోధించమని కోరుతాడు నచికేతుడు.)

వారిద్దరి సంభాషణను ప్రస్తావిస్తూ రాసిన ఈ కవిత పురాణ సహితం.

నిద్రించిన జ్ఞాపకాలూ
నిద్రాణమై న కలలూ
ఉలికిక్కిపడి లేచాయా ?
అయితే అది కవిత్వమే
భావాగ్నిపర్వతం
కవి.

తన మనసులోని భావాలను అక్షరీకరించనిదే కవిమనసు ఊరుకోదు. ఆ భావాల వెల్లువ ప్రవాహమే కవి అంటారు రఘుశ్రీ.

కొండను తవ్వి
ఎలుకను పట్టాడు
కొండను మలిచి
ఎలుకల్ని చేస్తాడు?
శిల్పి
గణేశ భక్తుడు.

కవి చేతి కలం ఎలాగైతే కవిత్వాన్ని పలికిస్తుందో శిల్పి చేతిలోని ఉలితో ఏరీతి లోనైనా శిల్పాలను చేయగలడు.

కసి
ప్రేరేపిస్తుంది
లక్ష్యం
ప్రేరణనిస్తుంది ?..
రెండు కళ్ళు
విజయానికి.

ఏదైనా సాధించాలన్న తపన మనసులో కసిని పెంచుతుంది. ఆ సమయంలో లక్ష్యం ఏర్పడుతుంది. ఆ తపన సాధించాలన్న కోరికతో ఉంటేనే సరిపోదు లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రయత్నం చేయాలి ఆ రెండు విజయానికి రెండు కళ్ళు లాంటివి అంటాడు కవి.

సేవ
కర్పూరం లాంటిది
శమగ్ని తోనే
వెలుగుతుంది?.
తృప్తి
కళ్ళలో కాంతి .

ఎంత అద్భుతంగా వర్ణించారండీ పైకవిత మనం ఎంత ఎక్కువగా సేవ చేస్తే మానసికంగా అంత ఉల్లాసంగా ఉంటాం.

శ్రమ తర్వాత లభించే ప్రతిఫలం చాలా గొప్పగా ఉంటుంది కదా..!

నేను రాసింది
నీ అర్థం కావాలంటే
నా స్థాయికి
నీవూ రావాలి?
కొమ్మలూ-వేర్లు
ఆధారం కాండమే.

ఎదుటివారిని అర్థం చేసుకోవాలంటే వారి తో సమానంగా మెలగాలి అలాగైతేనే వారి వ్యక్తిత్వం అర్థమవుతుంది కదా అదే విషయాన్ని చెట్టుతో పోల్చిచెప్పాడు కవి.

చేతిలోకి
తీసుకోగానే
ఆనందభాష్పాలు
రాలుస్తుంది జలం ?
నేలపైని
మన పాదాల్ని చూస్తూ ?

పై రెక్క సాధారణ వాక్యమే అయినా రాయడంతో కవి ప్రత్యేకత చూపించాడు .మామూలుగానే దోసిట్లోకి తీసుకున్న నీరు వేళ్ల సందుల్లోంచి

జారీ నేలపై పడే సమయంలో మన కాళ్లను కూడా తడుపుతుంది.ఆ రాలే నీళ్లను ఆనందభాష్పాలు అనడం పాదాలను చూస్తున్నాయని వర్ణించడం

రాయడంలో కవి చూపించిన ప్రత్యేకత కనిపిస్తుంది.

చాప కింద నీరులా
అన్నింటా పన్నులు
ఆత్మాభిమానంతో
ఆపన్నులు?.
మధ్యతరగతి
మందహాసం

పుడితే పేదవాడి గానైనా పుట్టాలి. లేదంటే ధనవంతుడిగా నైనా పుట్టాలి అంటారు పెద్దలు. మధ్యతరగతి జీవితాల పరిస్థితి ఎప్పుడూ డోలాయమానం గానే ఉంటుంది.

వెలుగు
నీడలు
ప్రకృతి
క్రీడలు?
లోకం
వేదిక.

కష్టం వెనుక సుఖం దుఃఖం తర్వాత ఆనందం లేదా సంతోషం ప్రతి జీవికి సహజమే ఇవన్నీ ఈ ప్రపంచ వేదికపై జరిగే ఆటలు అంటాడు కవి.

రెక్కలను ఆధ్యాత్మికపరంగా బోధించాడు.

నిన్న ఒక జ్ఞాపకం
నేడు ఒక అనుభవం
రేపు -నీకై
మొలకెత్తే విత్తనం?
విందుకీ పిలుపు
తీపి తలుపు పైరెక్కలో నిత్య జీవితం లో మానవుని కి జరిగే అనుభవాలను కవిత్వీకరించాడు.

పాఠం
జ్ఞానబోధ
అనుభవం
జ్ఞానసిద్ధి?.
రెండు పాదుకలూ
నడకకి ముఖ్యం.

అనుభవం నేర్పిన పాఠం చాలా గొప్పది అందువల్ల జ్ఞానం పెరిగి మన నడవడికను నిర్దేశిస్తుంది.

ఇలా విభిన్న మైన వస్తువులను తీసుకుని మినీ కవితగా మలిచిన తీరు అద్భుతంగా ఉంది.

రెక్కలు ప్రక్రియను వందల సంఖ్యలో కవులు అనుసరించారు.

ఒక్కొక్కరిదీ ఒక్కో పందాలో సాగాయి అలాగే రఘు శ్రీ గారి కవీంద్ర మోక్షం రెక్కలు " వారి జీవితంలో అనుభవించిన సంఘటనల ఫలితంగా పదునెక్కిన పదాల ప్రవాహం ఈ కవీంద్ర మోక్షం. ఒక్కో రెక్కను చదివినప్పుడు రఘు శ్రీ గారి ఆంతర్యం అర్థమవుతుంది.

రఘుశ్రీ గారికి హృదయపూర్వక శుభాకాంక్షలు.

-ప్రతులకు: వి.శ్రీలక్ష్మి
సెల్:9247108893

-జయంతి వాసరచెట్ల
9985525355

నిశ్శబ్ద చరణాలు (కథ)

మౌనంగా కూర్చుంది నెమలి. వాతావరణం చల్లగా ఉంది. చిట పట చినుకులు పడుతున్నా సరే తనకేమీ పట్టనట్లు కూర్చుంది. చల్లగాలి వీస్తోంది. పండిపోయిన ఆకులన్నీ కింద రాలిపోతూ ఒక దిక్కుగా కొట్టుకుపోతున్నాయి. ఇవన్నీ తనకు ఏమాత్రం ఆనందాన్ని ఇవ్వటం లేదు. ఎదురుగా దానికిష్టమైన అలసందలు, మరోవైపు పెసలు, నీరు అన్నీ ఉన్నాయి. ఏవీ తాకనైనా తాకటం లేదు. ఇంతటి మౌనాన్ని భరించలేని ఆడ నెమలి కన్నీరు పెట్టు కుంటోంది. ఈ వింత దృశ్యాన్ని చూస్తున్న బాతు అటుగా వెళుతూ..

"నెమలి రాజా ..రాణీ ఏమయింది? ఎందుకలా దు:ఖంలో ఉన్నారు? మీకు ఏం కష్టమొచ్చింది? పిల్లలందరూ బావున్నారు కదా? ఆహారం సకాలంలో అందుతోంది కదా? వాతావరణం ఏమయినా మీకు ఇబ్బంది కల్గిస్తోందా? కొంపదీసి? మీ కేమయినా వంట్లో బావుండటం లేదా?" లాంటి అనేక ప్రశ్నలు వేసింది.

"ఏం చెప్పమంటావు బాతు బావా! మేము బాగానే ఉన్నాము. అలాగని ఊరుకుంటే సరిపోతుందా? ఎండలు మండిపోతున్నాయి. కళకళలాడుతున్న పక్షి జాతి మొత్తం విలవిల లాడుతోంది. ఉండటానికి చెట్లు కరువైపోతున్నాయి. ఒకటీ అరా ఉన్నా నీరు లేక ఎండిపోతున్నాయి. జాతీయ పక్షులైన మేము ఏదో ఉండటానికి గూడు, తినటానికి తిండి ఉన్నా ఈ విపరీతపు వాతావరణానికి దిక్కు తోచడం లేదు. అలాంటిది ఏ దారీ లేని మిగిలిన పక్షులన్నీ ఎలా జీవిస్తాయి? మన జాతి మొత్తం తెలియక ఆవేదన చెందుతుంటే మేము మాత్రం ఎలా సుఖంగా ఉండగలం?" అని వాపోయింది ఆడనెమలి...

ఆ మాటలు విన్న బాతు కన్నీళ్ళ పర్యంతమయ్యింది. అవును అక్కా! మేము కూడా నీరు లేక బయటే జీవిస్తున్నాము. ఏదో కలిగింది తిని కాలం గడుపుతున్నాము. ఇన్నాళ్

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 541వ రోజు 'మజ్జిగ' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'మజ్జిగ' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

– సంపాదకులు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం ఏకాంశ కవిత్వం నిర్వహణ:
–డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839

పూర్ణభోజన సంతృప్తి

చం. చిలుకుచువెన్నతీయగను శీతలమౌ గుణసాంద్రధారగా
చెలిమినిజేయు మానవుల చింతలశాంతికి చెంతజేర్చగన్
పలుకులు మానసమ్ములకు పాత్రతగూర్చు మహోపకారియై
మలినము తీసివేయుగద మజ్జిగ మాయమరాటి రైతయై!

కం. సజ్జన సాత్విక పోషణ
ముజ్జగములనేలురసముమోదముగలుగన్
పజ్జొన్నగటుకదోసే
మజ్జిగనరిగించుతిండి మైత్రినిగూర్చన్.

ఉ. కొద్ది పుదీన పత్రములు కొంచెమునుప్పును జీలకర్రతో
నొద్దిక కొత్తిమీర రసముత్కుక మజ్జిగ నోర్పుమిర్చితో
సద్దికిచేర్చితిన్నపుడు చల్లదనమ్మున జిహ్వ జాగృతిన్
ముద్దలు ధారగా వెడలు ముద్దుల పాపలు వృద్ధులెంచకన్!!

తే.గీ. మజ్జిగపులుసు మంత్రమై మమతపంచు
నారు రుచులలో గొప్పది జోరుగలది
అన్నిమంటలనార్పగానమ్మరీతి
పూర్ణభోజన సంతృప్తి పొసగుచల్ల!!

ఉ. వేసవి తాపమున్ చెఱుచు వెన్నసుతీసినమజ్జిగొక్కటే
గోసలనెండదెబ్బలకు గోలుకొనంగను సేదదీర్చుచున్
భూసురువెజ్జుసూచనలు పూటకుపూటకునాచరించగన్
ధ్యాసను గాత్రమంతయు తాల్మి వసంతపు స్పర్శజేయుచున్!!.

–మాడుగుల నారాయణమూర్తి

చుక్క!

చిటచిట ఎండ !
కడుపులో మంట!
వేయాలి మజ్జిగ చుక్క !
ఎంచక్కా తాపం మటుమాయం!
ముజ్జగాలలో మజ్జిగ రుచి
దానికదే సాటి!.
విస్తరినిండా నోరూరించే వంటకాలు!
ఆఖరున మజ్జిగ అన్నంతినక
లేవరు భోక్తలు! వచ్చిన వారు!
మజ్జిగ తో దేహశాంతి!
పెరుగులో నీరు
కవ్వంతో చేయుపోరు!
వెన్న తేలితే ఉషారు!
నెయ్యి బదులు హాజరు!
మేలుకొలిపే చల్లచిలికే భామలు!
చిన్నికృష్ణుని అల్లరి చేతలు!
ఏవి ఆనాటి
మలయమారుతరాగ గీతికలు?.
మంది ఎక్కువైతే మజ్జిగ పల్చన
నేటి సామాన్యుడి బతుకు!
పొరిగింట అప్పుకై పడేతిప్పలు
చల్లకొచ్చి ముంత దాచుడు!.
కాఫీ చాయ్ వద్దు బాబోయ్!
ఉప్పు నిమ్మరసం కొత్తిమీర
కలిపిన మజ్జిగ పట్టించవోయ్!
బండీపైన లస్సీ గ్లాసులు
ఆప్యాయంగా పిలిచి
అలసట పోగొట్టు!
చలివేంద్రం లో మజ్జిగ తేట
బాటసారులకు అమృతపు ఊట!
మెంతి మజ్జిగ మజ్జిగ పులుసు
ఊరు మిరపకాయలు
అన్నంలోకి ఆదరువులు!
పగలు పెరుగు రాత్రి మజ్జిగ
ఆరోగ్యానికి మూలం!
మద్యం తాగిన వాడికి
మజ్జిగ తో మత్తు వదులుట ఖాయం!?.

–ఎ.రాజ్యశ్రీ

అమృత తుల్యం

కడలికి ఎందుకొచ్చిందో ఉప్పెన
కదిలి కదిలి
వాంతులు చేసుకుంటుంది
కెరటాల నురగను నింపుకొని
ఎనలేని శక్తిని ఒళ్లంతా నినీపుకొని
చెలియలి కట్టను దాటని నిబద్ధత
పాలసముద్రాన్ని
చిలికిన దేవ దానవులు
చాలా వాటిని బయటికి తెచ్చారు
మజ్జిగను తేవడం మరిచారు
కాని కలికాలంలో మానవుడికి మజ్జిగ
అమృత తుల్యమయ్యింది
దేవుడిచ్చిన వరమయ్యింది
మజ్జిగను పనీచడానికి
మోహినీ అవతారం అవసరం లేదు
ప్యాకెట్లలో దొరుకుతుంది సులువుగా
బీదా బిక్కి పంచుక తినేది
మజ్జిగ ప్రసాద మయ్యింది అంతట
బీదవాడి సంజీవి
ఎండలో సెదదీర్చేది
గొల్లవారివాడలో చల్లగా అమ్మ బడినీది
గోపబాలుడు రేపల్లె వాడల్లో పంచింది
మనకు వరనీగా వచ్చినీది
మా చల్ల మజ్జిగ
ఆలస్యం చేస్తే అవుతుంది పుల్లగా
పుదీనా, కొత్తిమీరు,పచ్చిమిర్చి తరిగి
ఉప్పేస్తే వుంటుంది మజాగా
ఎండాకాలం వేడిని చల్లార్చి
జీర్ణ శక్తిని పెనీచి
భువిపై అమృత తుల్యమై ఆదుకొంటుంది.

–కందుకూరి మనోహర్

వేసవిలో అమృతం

పెరుగు ను కవ్వంతో చిలికి
వెన్న వేరు చేస్తే మజ్జిగ
మజ్జిగ వేసవి అమృతం
ప్రజా సేవలో తమ వంతు
సహకారం అందిస్తూ మజ్జిగ
పాకెట్లు అందిస్తూ సేవ చేసే
అవకాశం ఈ వేసవి వరం
ఆరోగ్య రీత్యా నిత్య ఔషధం
ప్రాణ శక్తిమయం
అన్నంతిన్నాక మజ్జిగ తాగే
మంచి అలవాటు చేసుకోవాలి
తక్కువ ధరకు లభ్యమయ్యే
మజ్జిగ
నిమ్మ మజ్జిగ
దబ్బ మజ్జిగ
శొంఠి మజ్జిగ
అల్లం మజ్జిగ
మధుర మజ్జిగ
కరివేపాకు మజ్జిగ
వేసవి వడ దెబ్బ నుంచి
ఆరోగ్య కరంగా
వేసవి కాలంలో
ఎండలు ఎదుర్కొనే వరం.

–నారుమంచి వాణీప్రభాకరి

అచ్చతెలుగు పానీయము

మజ్జిగ శబ్దమే తెలుగు మాటకు నందము గౌరవమ్ము! ను
ద్భిజ్జము కాకయుండినను దీనికి నంతటి భాగ్యమబ్బెనౌ!
మజ్జిగలేని భోజనము మంచిది కాదను వైద్యశాస్త్రమున్!
సజ్జనులంత యిష్టపడు చల్లని పానము నెల్లవేళలన్!.

–రుద్రాక్షల మఠం ప్రభులింగశాస్త్రి

శ్రేష్ఠ పానీయం

పాలు కాచి తోడు
పెరుగు అవును చూడు
పెరుగు నీటితో కలిపి చిలికితే
మన మజ్జిగ తయారు..
పల్చని పానీయం
పెరుగు కన్న శ్రేష్ఠం
పోషక భరితం
ఔషధ యుక్తం
వేసవి తాపం
తగ్గాలన్నా
దాహం తీరాలన్నా
మజ్జిగ తాగాల్సిందే...
సామెతలకి పుట్టిల్లు
భరతావని..
మజ్జిగకు మినహాయింపు లేదు
మంది ఎక్కువైతే
మజ్జిగ పల చన
చల్లకొచ్చి ముంత
దాచినట్టు..
మజ్జిగ ఎంత పలచనైతే
అంత ఆరోగ్యం
మజ్జిగ బట్టర్ రహితం
పేరుబట్టర్మిల్క్..
వేసవితాపం చల్లార్చు
డిహైడ్రేషన్ నించి రక్షించు
చెడు కొవ్వులు తగ్గించు
జీర్ణ వ్యవస్థని బాగు పరుచు
పాలలో లేని
పోషకాలాగని
గడ్డ పెరుగులో నష్టాలు
పల్చటి మజ్జిగ లో లాభాలు
తేలిగ్గా జీర్ణం
అలసట నీరసం దూరం
మజ్జిగలేని భోజనం
అసంపూర్ణం.. అనారోగ్యం..

–మోటూరి శాంతకుమారి

ఉపాధి మార్గం

మందెక్కువైన మజ్జిగ పలచన
మజ్జిగ సేవించిన ఊష్ణం
ఉన్నఫలంగా ఆవిరి
వేసవికాలంలో మజ్జిగ
వితరణ కేంద్రాల దర్శనం
వేడి మంటలను ఆపివేయు
ఆకలి బాధను తరమివేయు
నీ కడుపు చల్లగుండా
అనే దీవెనలను పొందు
పేదవాడి సేద తీర్చు
అమృతం మజ్జిగ
దూప తీర్చుకోను మజ్జిగ
మజ్జిగ భోజనం
తిన మస్తుగా ఉండు
మజ్జిగ పాకెట్లు
బజారులలో దర్శన మిచ్చు
ఉచితంగా దొరికిన మజ్జిగ
ఇప్పుడు వ్యాపార సరుకుగా
ఎందరికో ఉపాధి మార్గం.

– గుండం మోహన్ రెడ్డి

మహాసముద్రాల కాలుష్యం జీవకోటికే పెనుశాపం

('ప్రపంచ మహాసముద్రాల దినం' సందర్భంగా)

నీరు లేనిదే జీవం లేదు. నీలి సముద్రం లేనిదే హరిత ధరణి లేదు. ధరణి ఉపరితలం 71 శాతం మహా సముద్రాల లవణ జలాలతో నిండి ఉంది. మహాసముద్ర జలాలు అపారమైన వృక్ష, జంతు, ఇతర సూక్ష్మజీవులకు నెలవుగా ఉంటున్నాయి. 1992లో 'రియో డి జనేరో'లో జరిగిన 'ఎర్త్ సమిట్'లో తీసుకున్న నిర్ణయం మేరకు ఐరాస, సముద్ర చట్టాల సమన్వయంతో ప్రపంచ మహాసముద్ర దినం పాటించుట జరుగుతుంది.

సముద్రాల ప్రధాన ప్రయోజనాలు:

భూగ్రహంపై ఉష్ణోగ్రత నియంత్రణ, వాతావరణంలో దాదాపు 70 శాతం ఆక్సీజన్‌ను అందుబాటులో ఉంచడంలో సముద్రాలు ప్రధాన భూమికను నిర్వహిస్తాయి. ప్రపంచ అడవుల వల్ల 28 శాతం మాత్రమే ఆక్సీజన్ లభిస్తున్నది. సముద్ర జలాల్లో ఉన్న సీవీడ్స్, ఫైటోప్లాంక్టన్, ఇతర సముద్ర మె?క్కలు మనిషి విడుదల చేసిన 30 శాతం కార్బన్ డై ఆక్సైడ్‌ను పీల్చుకొని ప్రాణవాయువుగా మార్చుతున్నాయని తెలుసుకోవాలి. సముద్రాలతో భూఉపరితల వాతావరణం నియంత్రించబడుతుంది. ఉపరితల గాలులు, వాటర్ కరెంట్లతో భూ ఉపరితలంపై జీవులకు అనువైన వాతావరణం నెలకొంటుంది. సముద్ర ఆహారంతో ప్రజారోగ్యమే కాకుండా మిలియన్ల ప్రజలకు జీవనోపాధి కల్పించబడుతున్నది. సాలీన సముద్ర ఆధార వ్యాపారం ద్వారా 282 బిలియన్ డాలర్ల ఆదాయం వస్తున్నదని అర్థం అవుతున్నది. సముద్ర జలాల్లోని 91 శాతం జీవుల ఉనికి నేటికీ తెలియదనే వాస్తవం ఆశ్చర్యాన్ని కలిస్తున్నది. సముద్రాల ఇతర ప్రయోజనాల్లో ఉపరితల వ్యాపారం, రవాణ, పవర్ జనరేషన్, క్రీడలు, పర్యాటకం, ఖనిజ సంపద, ఇంధనం లాంటి పలు అంశాలు కూడా ఉన్నాయి. భూమిపై ఉన్న అత్యధిక జీవ వైవిధ్యత సముద్ర జలాల్లోనే ఉన్నది. దాదాపు ఒక బిలియన్ ప్రపంచ ప్రజలకు ప్రోటీన్ పోషకాహారంగా సముద్ర జీవులు ఉపయోగపడుతున్నాయి. 2030 నాటికి సముద్ర ఆధార ఆర్థిక వ్యవస్థ ద్వారా 40 మిలియన్ల ప్రజలు జీవనోపాధిని పొందుతారని అంచనా వేస్తున్నారు.

ప్రపంచ మహాసముద్రాల దినం-2022 నినాదం:

జీవ వైవిధ్యం, ప్రాణికోటి మనుగడను సుసాధ్యం చేయడంలో సముద్రాల ప్రాధాన్యతను చర్చించే నిమిత్తం ప్రతి ఏట 08 జూన్ రోజున 'ప్రపంచ మహాసముద్రాల దినం (వరల్డ్ ఓసియన్స్ డే)' నిర్వహించుట జరుగుతున్నది. ప్రపంచ మహాసముద్రాల దినం-2022 నినాదంగా 'రీవైటలైజేషన్ : కలెక్టివ్ ఆక్షన్ ఫర్ ఓషియన్' అనే అంశాన్ని తీసుకొని, సముద్ర జీవరాసులతో మానవాళికి ఉన్న సంబంధాలను చర్చించుట జరుగుతుంది. మానవాళి సంక్షేమానికి తన వంతు బాధ్యతలను నిస్వార్థంగా నిర్వహిస్తున్న సముద్రాలకు కృతజ్ఞతలను తెలియజేసుకుంటూ, సముద్రాల సహజత్వాన్ని, సముద్ర జీవుల పరిరక్షణకు పూనుకోవాలనే సందేశాన్ని ఇవ్వడం జరుగుతుంది.

సముద్రాల కాలుష్యం:

నేటి ఆధునిక మానవుని దురాశ వల్ల 90 శాతం పెద్ద చేపలు అంతరించాయని, 50 శాతం కోరల్ రీఫ్స్ విధ్వంసానికి గురి అయ్యాయని తెలుస్తున్నది. సముద్రాల కాలుష్యాలలో విష రసాయనాలు, ప్లాస్టిక్, చమురు లీకేజీలు, పారిశ్రామిక - వ్యవసాయ వ్యర్థాలు, మురుగు నీరు లాంటివి ముఖ్యమైనవిగా తెలుపబడింది. సముద్రాలలో చెపల కన్న ప్లాస్టిక్ వ్యర్థాలు అధికంగా 8 మెట్రిక్ టన్నులు ఉన్నాయని, ప్రతి ఏటా 17.6 బిలియన్ పౌండ్ల ప్లాస్టిక్ సముద్రాలలో కలుస్తున్నదని అంచనా. భూతాపం వల్ల 2040 నాటికి మంచుకొండలు కరిగి సముద్ర మట్టం 2 అడుగులు, 2050 నాటికి 3 అడుగులు పెరిగి అనేక ద్వీపాలు మునిగి పోవడం, భూఉపరితలం మునగడంతో మానవాళి ఉనికికే అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఏర్పడనున్నాయని తెలుస్తున్నది.

తక్షణ కర్తవ్యం:

సముద్రాలను పరిరక్షించడం, సముద్రాలతో మానవాళి సంబంధ సమతుల్యత సాధించడం మన తక్షణ కర్తవ్యంగా భావించాలి. సముద్ర జలాల్లో అతిగా చేపలు పట్టడం, ఆమ్లగుణం పొందడం, సముద్ర జలాలు కలుషితం కావడం, సముద్ర జీవుల ఉనికికే ప్రమాదం వాటిల్లడం లాంటి చర్యలతో మనిషి సముద్రాల సమతుల్యతను దెబ్బ తీయడం జరుగుతున్నదని గమనించాలి. మహాసముద్రాలు భూమాతకే కాకుండా సకల జీవరాసులకు రక్షణ కవచమని, సాగరాన్ని అలక్ష్యం చేస్తే జీవావరణం నిర్జీవం అవుతుందని గుర్తెరిగి సముద్రాలను దేవతలుగా పూజిస్తూ, మనవాళి ఉనికికి పునాదులు వేసుకుందాం.

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

సమాజాన్ని మేల్కొల్పేదే సాహిత్యం

–తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండి మల్లారెడ్డి
కామారెడ్డి లో సమీక్షా వీక్షణం పుస్తక ఆవిష్కరణ.

జూన్ 01 తెరవే కామారెడ్డి జిల్లా అధ్యక్షులు ప్రముఖ కవి రచయిత సిరిసిల్లా గఫూర్ శిక్షక్ రచనల పై చేసిన సమీక్షల పుస్తకం "సమీక్షా వీక్షణం 1" పుస్తకాన్ని గఫూర్ శిక్షక్ జన్మదినమైన జూన్ 01 న తెరవే కామారెడ్డి జిల్లా శాఖ ఆధ్వర్యం లో కర్షక్ బియిడి కళాశాల లో తెరవే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొండి మల్లా రెడ్డి ఆవిష్కరించారు

ఈ కార్యక్రమం లో కర్షక్ బియిడి కళాశాల ప్రిన్సిపాల్ డా యెస్ కె రషీద్ తెరవే రాష్ట్ర ఉపాధ్యక్షులు అశోక్‌డా నమిలి కొండ సునీత మోహన్రాజ్ పీతాంబర్ గంగా ప్రసాద్ రవీందర్ పబ్బ విజయశ్రీ పాల్గొన్నారు

'వెలుగు దివ్వెలు' కవితా సంపుటికి కృతి జాతీయ పురస్కారం

ప్రకాశం జిల్లా,సింగరాయకొండ మండలం ,పాకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు,కవి శ్రీ పిల్లి హజరత్తయ్య రచించిన తొలి కవితా సంపుటి ×వెలుగు దివ్వెలు×రచనకు గాను కృతి జాతీయ పురస్కారమును అందుకున్నారు. 4/6/22 వ తేదీన ఒంగోలులోని సిపిఐ కమ్యూనిటీ హాలులో కృతి ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సాహిత్య, కళా,సేవా రంగాలలో సేవలు చేసిన వారికి కృతి ఫౌండేషన్ చైర్మన్ బి.వి.అశ్విని గారు ఈ పురస్కారానికి ఎంపిక చేశారు. ఈ కార్యక్రమమునకు సభాధ్యక్షులుగా కవి,సినీ గేయ రచయిత కళారత్న శ్రీ బిక్కికృష్ణ గారు ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ తెలుగు అకాడమి చైర్మన్ నందమూరి లక్ష్మి పార్వతి గారు, విశిష్ట అతిథిగా ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ చైర్మన్ మందపాటి శేషగిరిరావు గారి చేతుల మీదుగా తాను రచించిన కవితాసంపుటి ×వెలుగు దివ్వెలు×రచనకు గాను పిల్లి హజరత్తయ్య గారు కృతి జాతీయ పురస్కారం అందుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సుప్రసిద్ధ గజల్ రచయిత్రి రాజా వాసిరెడ్డి మల్లేశ్వరి గారు,ప్రకాశం జిల్లా వైఎస్సార్ సీపీ మహిళా విభాగ ప్రధాన కార్యదర్శి శ్రీమతి జమ్మలమడక నాగమణి గారు,జననీ వెల్ఫేర్ ట్రస్ట్ చైర్మన్ యం.వి.ఎస్.మణి గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తాను రచించిన వెలుగు దివ్వెలు కవితాసంపుటి కృతి జాతీయ పురస్కారమునకు ఎంపిక కావడం పట్ల కవి వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీ పిల్లి హజరత్తయ్య గారు సంతోషం వెలిబుచ్చారు.

సుధామ 'జీవనసంధ్య' వయోధికులకై వ్యాససంపుటి ఆవిష్కరణ



ప్రముఖ కవి,రచయిత,కార్టూనిస్టు,కాలమిస్టు సుధామ 'వాయిస్ ఆఫ్ సీనియర్ సిటిజన్సు' మాసపత్రికలో మూడేళ్ళకు పైగా వయోధికులకోసం రాసిన 'సీ'నియర్ కబుర్లు కాలమ్ వ్యాసాల సంపుటి 'జీవన సంధ్య' గ్రంథంగా జూన్ అయిదు ఆదివారం ఉదయం రవీంద్రభారతి పైడి జయరాజ్ ఆడిటోరియమ్ లో 'కోకిలమ్'సంస్థ ఆధ్వర్యంలో జరిగిన పురాణం శ్రీనివాసశాస్త్రి కథల సభలో ఆవిష్కరించడం జరిగింది. ప్రముఖ రచయిత , కళావిమర్శకులు,జ్యోతి మాసపత్రిక పూర్వ సంపాదకులు , సాహితీవేత్త శ్రీ తల్లావఝుల శివాజీ పుస్తకాన్ని ఆవిష్కరించారు ప్రముఖ రచయిత్రి శ్రీమతి ఇంద్రగంటి జానకీబాల ముఖ్య అతిథిగా పాల్గొన్న ఈ సభలో ప్రముఖకథారచయితలు శ్రీయుతులు వి.రాజారామమోహన్ రావు,దాదాహయాత్ ,ముక్కామల చక్రధర్ విశిష్ట పాత్రికేయులు శ్రీ గోపీనాథ్ ,శ్రీ రంగాచారి ,కవులు వసీరా,సాంధ్యశ్రీ ,శ్రీమతి పురాణం సుశీల ప్రభృతులు పాల్గొన్నారు .

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి : మంత్రి సత్యావతి రాథోడ్

హన్మకొండ, జూన్ 8: మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని.. ఆ దిశగా ఇప్పటి నుంచే అడుగులు వేయాలని మంత్రి సత్యావతి రాథోడ్ అన్నారు. వడ్డెపల్లి పింగళి మహిళా డిగ్రీ కాలేజీలో ఏర్పాటు చేసిన ఇంటర్ డిసిప్లినరీ నేషనల్ కాన్ఫరెన్స్ ముగింపు కార్యక్రమంలో మంత్రి సత్యావతి రాథోడ్, ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, కూడా చైర్మన్ సుందర్ రాజ్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సత్యావతి రాథోడ్ మాట్లాడుతూ.. మహిళలు సమాజంలో గౌరవంగా జీవించేలా తీర్చి దిద్దుతున్న కళాశాల అధ్యాపక, ప్రిన్సిపాల్ కి అభినందనలు తెలిపారు. పింగిలి కళాశాలకు చరిత్రాత్మక గుర్తింపు ఉందని, మహిళలు విధానపరమైన నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదిగారన్నారు. తెలంగాణలో తొలి మహిళా మంత్రి అయ్యనంటే అది కేసీఆర్ చలవేనని, నాది 30ఏండ్ల రాజకీయ ప్రస్థానం అని గుర్తు చేశారు. దేశానికి ప్రధాని అయిన ఇందిరా గాంధీయే మహిళలకు ఆదర్శం అన్నారు. కేంద్ర ప్రభుత్వం చట్ట సభల్లో 33శాతం రిజర్వేషన్ అమలు చేయాలన్నారు.

పరిశుభ్ర తెలంగాణ సాధించడమే పల్లె, పట్టణ ప్రగతి ప్రధాన లక్ష్యం.. ఎమ్మెల్యే అరూరి

వరంగల్, జూన్ 8:తెలంగాణ రాష్ట్రంలోని ప్రతీ పట్టణం పచ్చదనంతో పరిశుభ్రంగా ఉండాలనే సీఎం కేసీఆర్ పట్టణ ప్రగతి కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని తెరాస వరంగల్ జిల్లా అధ్యక్షులు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ తెలిపారు. పట్టణ ప్రగతి కార్యక్రమంలో భాగంగా వర్ధన్నపేట మున్సిపాలిటీ కేంద్రంలో పబ్లిక్ మరుగుదొడ్లను, వైకుంఠ రథాన్ని ఎమ్మెల్యే అరూరి రమేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ పాలక వర్గం, మండల ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

17 పంటలకు కనీస మద్దతు ధర పెంపు.. కేంద్ర కేబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ, జూన్ 8:కేంద్ర మంత్రివర్గం కీలక నిర్ణయం తీసు కుంది. 17పంటలకు కనీస మద్దతు ధర పెంచేందుకు కేంద్ర కేబినెట్ ఆమోదం తెలిపింది. సోయాబీన్ క్వింటాల్ కు కనీస మద్దతు ధరు రూ.300లు పెంపు, కందులు క్వింటాల్ కు రూ. 300లు పెంపు, పెసర్లు క్వింటాల్ కు రూ. 480లు పెంపు, పొద్దుతిరుగుడుపై రూ.385లు కనీస మద్దతు పెంచుతూ కేంద్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది.

కణిక

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న

'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

నిర్వహణ: **శ్రీమతి సత్య నీలిమ వలిపే**
ఈ సమూహంలో చేరదలచినవారు 8985613123కి మెసేజ్ చేయవచ్చు.

(ప్రథమ)

మదిగీచిన చిత్రం

కమ్మని కలల కాసారంలో
వికసిత కమలాల వింజామరలు
పిల్లవాయువులపిలుపులతో
అల్లరల్లరిగా నవ్వే
ఝుంటి తేనెటీగల నాధాలకు
జలం నుండి
బుడుంగున బయటకు వచ్చి
విప్పారిన మోముతో తేరిపారచూసి
విస్తుపోయే జలచరాలతో
ఏరు నవ్వుతూ తుళ్ళుతుంటే
నయనానందమై
మది పరవశించె.
భానూదయపు కిరణాలు సోకగనే
వికసిత వదనంతో రెమ్మలు విప్పుకుంటూ
పైరగాలి పదనిసలలో ఈలలువేసే
వాయునాధాలతో
బురకపిట్టలు నీటిలో
బుడుంగున మునిగితేలుతూ
మరుస్తుంటే
హాయిగొలిపేను మది
ఆనందమందేంచేను మరపురాని
మదిగీసిన చిత్రం
ఆకుపచ్చనిచేలు అలలు అలలుగా
వీచె వాయువులతో సయ్యాటలాడుతుంటే
భూదేవమ్మ
పచ్చని తివాసి పరచి పలుకరిస్తుంటే
చల్లచల్లని హాయి గొలిపే
గాలులతోఆనందమందుతుంటే
పంకాన్ని మరచిన
మది ఒడ్డున కూర్చుని మురుస్తుంటే
హాయి గొలిపేను కాయం
ఆనంద తాండవ
సమీరాలతో...

–దా॥బందారి సుజాత

(ద్వితీయ)

మౌనం కుంచె పట్టిన వేళ

మది గదిలో మౌనం
కుంచె పట్టింది...
వేవేల భావాలు ఎన్ని
రంగులు అద్దుకున్నాయని...
దూరమైన చెలి కనుచూపు మేర
వెన్నెల కంటున్న రాత్రికి
కటిక చీకటి కాటుక అద్దింది...
అంతలోనే హృదయం లోకి చేరి
విరహ వేదనలో రగులుతున్న
వదనానికి
నవ్వుల నవనీత వర్ణాన్ని పూసింది...
ఒంటరి ఐనా దేహాలకి
జంటగా పసిడి వర్ణ పచ్చని
పచ్చిక పానుపుమీద
రేలపూల సొగసును
పరిచయం చేసింది
గలగలా పారే జ్ఞాపకాల నదికి
అనుభవాల అడ్డుకట్ట వేసి
నీలా కాశమే నీకు నాకు
హద్దని కారు మేఘాలతో
ఊహల ఊయల ఊపింది ..
ఇద్దరిని జత కలిపిన వేళ
నులి వెచ్చని నిట్టూర్పుల సాక్షిగా
మధురమైన రుధిర జలపాతాలే
నీకు కళ్యాణ తిలకమై పలుకరించిన
నా సుతిమెత్తని
పాదాలకు పారాణి రంగరించిన
ఆ మౌనం మౌనంగా
వేవేల భావాలకు
సప్తవర్ణ తైలాభిషేకం చేసిన
ఆ కుంచె ఎంత గడసరి..!!??
ఆ మది గీసిన చిత్రం
ఎంత సొగసరి.

–దుర్గా మహాలక్ష్మి ఒలేటి

కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారం - 2022 పోటీలకు కవితాసంపుటాలకు ఆహ్వానం

ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్, కవిసమ్మేళనం సాహిత్యవేదిక వ్యవస్థాపకులు కొత్తపల్లి నరేంద్రబాబు స్మారకార్థం ప్రతిఏటా ఇచ్చే సాహిత్య పురస్కారానికి కవితాసంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ప్రముఖ కవి, నిర్వాహకులు కొత్తపల్లి సురేష్ తెలిపారు.

2022 ఏడాది కొత్తపల్లి నరేంద్రబాబు సాహిత్య పురస్కారానికి 2021 డిసెంబరు లోపుఅచ్చైన పుస్తకాలను 30/06/2022 తేదీ లోపు కొత్తపల్లి సురేష్, ఇంటి నంబర్ : 33-129-1, OVR కాలనీ, SRMT గోడౌన్ దగ్గర, కళ్యాణదుర్గం రోడ్, అనంతపురం - 515001. ఫోన్: 9493832470 అనే చిరునామాకు పంపించాలని కోరారు.

జాతీయ స్థాయిలో పలువురు పోటీపడే ఈ అవార్డుకు న్యాయనిర్ణేతలుగా ప్రముఖ సాహితీవేత్తలు ముగ్గురు వ్యవహరిస్తారని కొత్తపల్లి సురేష్ తెలిపారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి : ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

ఖమ్మం, జూన్ 8: అధికారులు సమన్వయంతో పనిచేసి పట్టణ ప్రగతి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, పట్టణాల్లోని సమస్యలను ఎప్పటి కప్పుడు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ ఉ పినపాక శాసనసభ్యులు ఉ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతారావు అన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు పట్టణంలో లోని ఎస్బిఐ బ్యాంకు పక్కన గల కట్ట వాగు వద్ద పట్టణ ప్రగతిలో భాగంగా జరుగుతున్న పనులను ప్రభుత్వ విప్ రేగా కాంతారావు, జిల్లా కలెక్టర్ దురిశెట్టి అనుదీప్, స్థానిక ప్రజాప్రతినిధులు అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా జరుగుతున్న పనుల పురోగతిని వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎప్పటికప్పుడు జరుగుతున్న పనులను అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. ఆయా పట్టణాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ఆధ్వర్యంలో
40వ కార్యక్రమం
కిష్టడి కతలు
ఆర్.సి.కృష్ణస్వామిరాజు
కిష్టడి కతలు
గ్రంథావిష్కరణ సభ
సభాధ్యక్షులు: శ్రీ సోమేపల్లి వెంకట సుబ్బయ్య
అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం
పుస్తక ఆవిష్కర్త: శ్రీ కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ గారు
ప్రముఖ రచయిత
గౌరవ అతిథి: శ్రీ శ్రీకంఠస్వామి గారు
ప్రముఖ కథారచయిత
గ్రంథ సమీక్షకులు: శ్రీమతి వైష్ణవిశ్రీ గారు
ప్రముఖ రచయిత్రి
రచయిత స్పందన: శ్రీ ఆర్.సి. కృష్ణస్వామిరాజు గారు
తేది: 19 జూన్ 2022 ఆదివారం ఉదయం 10.30 గంటలక